పరమసంత్ పరమదయాల్

పండిత్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

# సత్సంగసుధ

(మూడవ భాగం)

అనువాదం

జ్యోతిరాణి

ప్రోత్సాహకులు

దయాల్ శివమంగళసింహ మహారాజ్

ప్రకాశకులు

శివ సాహిత్య ప్రకాశన మండలి

రాధాస్వామి సత్సంగ భవనం

ప్లాట్ నం.7, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్



సంత్ సద్గురు వక్త్
పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

# ఇందులో


| వరుస సంఖ్య | అంశం | సత్సంగం తేది | పేజి |
|---|---|---|---|
| 1. | మంగళాచరణము | | i |
| 2. | జ్ఞానవిచారం - చేతావని | | ii |
| 3. | పరమదయాల్ ఏంచిన ఆణిముత్యాలు | | iii |
| 4. | తీసుకోవటం - ఇవ్వటం | 7-12-1980 | 1 |
| 5. | పరమదయాల్ లేఖ | 19-11-1980 | 16 |
| 6. | దానం | 27-4-1975 | 17 |
| 7. | దుఃఖం | 6-11-1980 | 28 |
| 8. | ఫకీర్ అంతిమ గురుపూర్ణిమ వచనములు | 17-7-1981 | 38 |
| 9. | వందన | | 53 |

# మంగళాచరణము

మంగళం గురుదేవ మూరతి, మంగళం పదపంకజం
మంగళం అవ్యక్త అనుపమ, మంగళం భవగంజనం

మంగళం ధుర్ పద నివాసీ మంగళం సత్ ఆసనం
మంగళం నిర్వాణ సద్గతి మంగళం జనరంజనం

మంగళం జ్ఞానాస్వరూపమ, మంగళం ఆనంద రూప్
మంగళం చైతన్య సదనమ, మంగళం సత సత్యభూప్

మంగళం యోగేంద్రమాయా, తీత మంగళ దాయకం
మంగళం సంసారసారమ అద్భుతం మునినాయకం

మంగళం త్రైగుణ రహిత అపరోక్ష ప్రోక్షనివాసనం
మంగళం త్రైకాల జ్ఞాతా మంగళం భవనాశనం

ఆది కారణ మూలకారణ మధ్య ఆది అనంతజో
మంగళం కరుణా సదన శుభ తత్వ పరమ జగత్ప్రభో

ఆప్ ప్రగటే ఇస్ జగత్‌మే జీవ కాజ సుధారనే
శబ్దనావ బనాయ సుందర జీవ దుఃఖిత ఉబార్‌నే

ప్రాణ్ తన్ మన్ కర్మవాణీ సబ్‌హై అర్పణ్ కీజియే
మైహుం శరణాగత తుమ్హారా దాస్ అప్నా కీజియే

రాధాస్వామీ రాధాస్వామీ రాధాస్వామీ జప్ సదా
త్యాగ్ జగ్‌కే మోహ ధంధే పావూం భక్తీ సంపదా

## దాతా దయాళ్ పరమదయాళ్ మహారాజ్‌ను ఉద్దేశించి ఇచ్చిన జ్ఞాన విచారం

ఫకీరా రూప్ తేరా అతి ప్యారా ॥

తూ సత్ చిత్ ఆనంద్‌కీ మూరత్, తూ తీనోఁ సేన్యారా ।
తేరీ గతిమతి బుద్ధిన జానే, అటక్ రహీ మంఝ్ ధారా ॥1॥ ॥ఫకీరా॥

కరమ్ కియా సత్‌కే చఢా ఘాటీ, చిత్‌మే వివేక్ విచార ।
సత్త్ చిత్త్ ఆనంద విలాసా, చహుఁదిస్ హరష్ పసారా॥2॥ ॥ఫకీరా॥

తీన్ త్యాగ్ చౌథేకో ధారే, సో సబ్‌కా ఆధారా ।
ద్వంద్వ జగత్ త్రిపుటీకీ త్రికుటీ, ఛోడ్ చలా ఘర్‌బారా॥3॥ ॥ఫకీరా॥

నహీఁతూదోయ్‌న తీన్ చార్‌హై నహీఁ తూసహస్ హజారా ॥
ఏక్ఏక్ హై ఏక్ ఏక్ హై జానే జానన్ హారా ॥ 4 ॥ ॥ఫకీరా॥

ఏక్ అనేక్ కహోఁ హై తుఝ్‌మే యహభీ భూల్ వికారా
రాధాస్వామి దయా రూప్ లఖ్ అప్‌నా, తూవ్యాపక్ సంసారా॥5॥ ॥ఫకీరా॥

## చేతావని

తూతో ఆయా నర్ దేహీమే ధర్ ఫకీర్‌కా భేసా ।
దుఃఖీ జీవ్ కో అంగ్ లగాకర్ లేజా గురు కీ దేశా ॥1॥

తీన్ తాప్‌సే జీవదుఃఖీహై నిబల్ అబల్ అజ్ఞానీ
తేరా కామ్ దయాకా భాయీ నామ్‌దాన్ దే దానీ ॥2॥

తేరా రూప్ హై అద్భుత్ అచరజ్ తేరీ ఉత్తమ దేహీ ।
జగ్ కళ్యాణ్ జగత్‌మే ఆయా పరమదయాల్ సనేహీ ॥3॥

జో ఫకీర్ మోహే దర్శన్ దేవే అప్నా భాగ్ సరాహూఁ
అపనీ తన్‌కీ చామ్‌కీ జూతీ పగ్ ఫకీర్ పహనావూ ॥4॥

మై నహీ రామకృష్ణకా సేవక్ ఈశ బ్రహ్మ నహీఁ జానూ ॥
మై ఫకీర్ కానామ్ దివానా సబ్‌సే బఢ్‌కర్ మానూ ॥5॥

# పరమ దయాల్ మహారాజ్

## ప్రతి సత్సంగంలోనూ పంచిన ఆణిముత్యాలు

1. సదా శుభసంకల్పం చేయాలి.

2. నీ కెవరిమీద విశ్వాసం కుదిరితే వారి నొక్కరినే పరిపూర్ణంగా విశ్వసించు. ఈరోజు దేవిని, రేపు రాముని, ఎల్లుండి కృష్ణుని లేదా బాబాజీని కొలిస్తే రెంటన చెడ్డ రేవడివి అవుతావు.

3. నీ స్వార్థంకోసం ఎవరినీ మోసం, దగా చేయకూడదు.

4. అన్యాయంగా ఇతరుల సొమ్ము కైవసం చేసుకోకూడదు.

5. ఎవరితిండి వారే సంపాదించుకుని తినాలి.

6. స్త్రీలే జాతి నిర్మాతలు. సత్సంతానాన్ని కనండి.

7. సత్యమైన సత్పురుషుడైన సద్గురువు శరణు వేడుకోవాలి. దొంగ గురువుల నుండి తప్పించుకోవాలి.

8. నామం జపించేముందు నీవు నిష్కల్మశుడవై, నిజాయితీపరుడవు కావాలి. మనసు పవిత్రంగా వుంచుకో. లేదా ఆ నామమే నిన్ను తినేస్తుంది. నీయత్‌కో సాఫ్ రఖో.

9. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అభ్యాసం చేయండి.

10. గురుచరణాలే ప్రకాశం, జ్ఞానం, వివేకం, బుద్ధులే (సమఝ్) గురునామం. అంతరంలో ప్రకాశ దర్శనం చేసుకొనండి.

11. ప్రతిరోజూ దానం చేయండి. మీ పేదరికం దూరం అవుతుంది.

12. ఇళ్లలో శాంతి నెలకొనేలా చూడండి. కలహాలు జరిగే ఇంట్లో ఏదో ఒక ఆపద, నష్టం సంభవిస్తుంది.

13. జైసా కరోగే వైసా భరోగే.

14. నీ కేది లభించినా అది పూర్వజన్మలోనో లేదా ఇప్పటి జన్మలోనో చేసిన కర్మఫలమే తప్ప నిన్నెవ్వరూ సుఖపెట్టరు, కష్టపెట్టరు.

15. పూర్ణ విశ్వాసంతో గురువుని అంతరంగంలో దర్శింపచేసుకొని జననమరణాల చక్రం నుండి విముక్తి పొంది నిజగృహానికి చేరడానికి యత్నించాలి.

16. నేనెవర్ని, ఎక్కడ నుండి వచ్చాను? ఎక్కడికి వెళ్తాను? అసలైన భగవంతుడెవరు? ఎక్కడుంటాడు? నిజగృహానికి నేనెలా చేరుకోగలను? అని ప్రతి మనిషీ ఆలోచించాలి.

17. గురువుని మనిషి అని భావించకు. ఆయన పరిపూర్ణ సర్వాధారుడైన పరమాత్ముడని భావిస్తేనే నీవు ఇహపరాలలో జయం పొందుతావు.

18. మానసిక, శారీరక బ్రహ్మచర్యాన్ని పాటించు.

19. మనస్సు, వాక్కు, కర్మల ద్వారా శుద్ధంగా పవిత్రంగా ఉండాలి.

20. మానవా ! మనిషివి కమ్ము ! ఇన్సాన్‌బనో, బీమాన్.

21. క్షమ, ప్రేమ, శుభ సంకల్పం, శరణాగతి, నిష్కామకర్మ, బ్రహ్మచర్య పాలన నిన్ను ఉద్ధరిస్తాయి.

22. సంత్ మతంలోకి రాదలిస్తే ముందుగా మాంస భోజనం, మద్యపానం, వ్యభిచారం, దొంగతనం వంటి అలవాట్లను విడిచిపెట్టు.

23. ఎవరికైనా బాకీ వుంటే వెంటనే ఇచ్చేయి. ఎగ్గొడితే ఆ పాపకర్మనుండి నిన్ను ఏదేవుడూ, ఏ గురువూ, సంత్ మహాత్ముడూ రక్షించలేడు. మరో జన్మలోనైనా ఈఋణాన్ని తీర్చుకోక తప్పదు.

24. సజ్జన సాంగత్యంలో ఉండాలి. మనమందరం ప్రకాశ స్వరూపులమే !

25. సత్యమైన పరమ తత్వాధారుని చేరుకోవాలనే తపన కలిగినవారే దుఃఖ జీవులు, వారిని గురుదేశానికి తీసుకుపొమ్మని దాతా నన్ను ఆదేశించాడు.

# పరమసంత్ పరమదయాల్
# పండిత్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

# సత్సంగం

## మానవతామందిరం - హోషియార్‌పూర్

## డిసంబర్ 7, 1980

## తీసుకోవటం - ఇవ్వటం

**కా**శ్మీర్ నుండి వచ్చిన సత్సంగీయులు కాశ్మీరీ భాషలో హుజూర్ పరమదయాల్ మహారాజ్‌కి హారతి ఇచ్చారు. దాని అర్థం ఇలా ఉంది.

1. మేము మిమ్మల్ని ఓంకార స్వరూపులుగా తెలుసుకొని మీ శరణుకోరి వచ్చాం. మీకు శత వందనాలర్పిస్తున్నాం.
2. ఓ అంతర్యామీ! మీ చరణాలకు కోటికోటి ప్రణామాలు!
3. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, దేవతలు, మునీశ్వరులు, లక్షలాది సంత్ స్వరూపులు నతమస్తకులై మీ ద్వారం దగ్గర శిరసు వంచి నిల్చుని ఉన్నారు.
4. అనంత విజ్ఞాన సాగరంలో నీటిబిందువుల్లా సూర్య, చంద్ర, యమాది వర్గం మీలోనే నిండి ఉన్నారు.
5. ఋషులు, మునులు, దేవతలు మిమ్మల్ని పరమాత్మ స్వరూపంగా గుర్తెరిగి వందనములర్పిస్తున్నారు.
6. మిమ్మల్నెలా స్తుతించగలను? వ్యాసుడు తదితర మునీశ్వరులుసైతం మీ మహా మహిమల ఆది-అంత్యాలు తెలుసుకోలేక మౌనంగా ఉండిపోయారు.
7. అతి పవిత్రమైన అంతరంగం కలవాడా! వేదాలు, ఉపనిషత్తులు మీ స్తోత్రాలే పఠిస్తున్నాయి. కీర్తిస్తున్నాయి.

8. గోవిందుడు కూడా మిమ్మల్ని పరమతత్వాధారునిగా తెలుసుకొని మీ స్తుతి గీతాలే పాడుతున్నాడు.

9. ప్రత్యేకంగా నేను ఏ దానధర్మాలు, సత్కర్మలు చెయ్యకపోయినా ఆ పరమసంత్ నన్ను తన వాణ్ణిగా చేసుకున్నాడు.

10. నా మనసు, బుద్ధి అన్నీ ఆయనకే అర్పించి, అతని ధ్యానంలోనే నిమగ్నమై, అతని స్వరూపమునే అన్ని దిశలలో చూస్తున్నాను.

11. ఆకస్మికంగా నాకు ఆ అలఖ, ఓంకార దర్శనం లభించింది. నాపై దయాదృష్టి ప్రసరింపచేసి, నన్ను కూడా ఆ అగమ దేశానికి తనతోపాటు నడవమన్నాడు.

12. నా సమస్త పాపాలు, సంతాపాలు, శాపాలు నశింపచేసి నా జీవనాన్ని సుఖమయం చేశాడు.

13. నా జీవనాన్ని ఆయన ప్రేమమయం చేశాడు. సంత్ సద్గురు శరణంలోకి వెళ్ళిన వారే ముక్తిని పొందగలరు.

## రాధాస్వామి !

మీలో కొందరు బొంబాయి నుండి, మరి కొందరు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చారు. "నీవేం నాటకం విరచించావని" నేను నా ఆత్మని ప్రశ్నిస్తాను. మిత్రులారా! దుఃఖంతో, అశాంతితో బాధపడేవారు నా వద్దకి వస్తుంటారు. నాకు బోధపడిన అంశాల్నే మీకు వివరిస్తుంటాను. ఈ లోకంలో మనమంతా పూర్వజన్మల కర్మల ననుసరించి కలుసుకుంటూ ఉంటాం. పూర్వజన్మలో ఎవరెవరితో సుఖదుఃఖాలు, ఋణానుబంధాలు ముడిపడి ఉన్నాయో ఆయా సంస్కారాల వలన ఒకరినొకరం కలుసుకుంటూ ఉంటాం. ఇది ఇచ్చిపుచ్చుకునే ప్రపంచమని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇక్కడ ఋణానుబంధాలు తీర్చుకోవటం, ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోవడం సంభవిస్తూ ఉంటుంది.

మొన్న సుభాష్ ఒక విషయం చెప్పాడు. పంజాబ్‌లోని ఓ గ్రామంలో ఉండే ఒక వ్యక్తి హైద్రాబాద్‌లో నవాబు దగ్గర ఉన్నతాధికారి పదవిలో ఉన్నాడు. అతను ప్రతియేడూ తన స్వగ్రామానికి వచ్చేవాడు. ఇది 1925-26 నాటి సంగతి. ఒకసారి ఆయన తన ఊరికి వచ్చినప్పుడు రాత్రిపూట నిద్రలో ఒక స్వప్నం వచ్చింది. ఆ కలలో ఒక ఎద్దు వచ్చి "నేను నీ తాతను. ఈ ఊళ్ళో ఫలానా పేరుగల గానుగవాడు ఉన్నాడు.

అతని దగ్గర ప్రస్తుతం నేను ఎద్దుగా జన్మమెత్తాను. ముసలివాడినయ్యాను. మొదటిలా పని చెయ్యడానికి శక్తి చాలటం లేదు. అతనికి నేనింకా తొమ్మిది రూపాయలు ఇవ్వవలసి ఉంది. ఆ 9 రూపాయులూ నువ్వతనికి ఇచ్చేస్తే నాకు విముక్తి కలుగుతుంది''అని చెప్పింది.

మర్నాడు ఉదయం క్షవరం చేయడానికి మంగలివాడు రాగానే ఈ పంజాబీ అధికారి అతని ద్వారా వివరాలు తెలుసుకోదలచి "క్షవరం తరువాత చేద్దువుగానీ ... ముందు ఈ విషయం చెప్పు. ఈ ఊళ్ళో ఫలానా పేరుగల గానుగవాడు ఉన్నాడా?"అని అడిగాడు "ఉన్నాడు'' అని క్షురకుడు చెప్పాడు. "పద! నన్ను అతని వద్దకు తీసుకు వెళ్ళు''.. అన్నాడు. క్షురకుడు ఈయన్ని వెంటబెట్టుకుని గానుగవాడి వద్దకు తీసుకువెళ్ళాడు. గానుగవాడు ఇతనిని ఎంతో సమాదరించాడు. తరువాత, "నీ వద్ద ఎన్ని ఎద్దులు ఉన్నాయి.?'' అని ఈయన అడిగాడు "ఒక్కటే'' అని గానుగతను జవాబిచ్చాడు. "నువ్వెంత అడిగితే అంత డబ్బు ఇస్తాను నాకు ఆ ఎద్దుని అమ్ముతావా?'' అని అన్నాడితను. 9 రూపాయలిమ్మన్నాడతడు. ఇతను 9 రూపాయలిచ్చి ఎద్దును తీసుకొని ఇంటికి పయనమైనాడు. పదడుగులైనా వేసిందో లేదో ఎద్దు కిందపడి చనిపోయింది. ఈ ఉదంతం విని ఇది నిజమేనా? అని ప్రశ్నించుకున్నాను.

మరొక సంఘటన చెబుతాను వినండి. ఇది నా స్వవిషయం. నాకు ముగ్గురు కూతుళ్ళు. పెద్దమ్మాయి పెళ్ళిలో నలభై తులాల బంగారం ఇచ్చాను. ఘనంగా పెళ్ళి జరిపించాను. రెండవ కుమార్తె పెళ్ళికి కేవలం 5 తులాల బంగారం ఇచ్చి, 1500 రూపాయల ఖర్చుతో వివాహం చేశాను. నేను రెండవ కూతురికి న్యాయం చేయలేదని నా భార్య సదా గొణుగుతూ ఉండేది. రెండో అమ్మాయి అత్తవారింటికి వెళ్ళేటప్పుడు ఆమెతో అన్నానిలా "బిడ్డా! పూర్వజన్మలో నేను నీకు ఋణపడిఉన్న 700 రూపాయలు ఇంకా నీకు నేనివ్వాల్సిఉంది. అవికూడా ఇప్పుడే ఇచ్చేస్తే నీకూ నాకూ బంధం తెగిపోతుంది. మరెప్పుడైనా ఇస్తాను. నీకు అత్యవసరం కలిగినప్పుడు నేను బ్రతికుంటే ఇస్తాను.లేకుంటే నీ సోదరుడు పదమ్ వద్దనో, పురుషోత్తమ దాస్ దగ్గరనో తీసుకో. వారికి అప్పగించి పోతాను. ...''అని చెప్పాను. కొన్నాళ్ళ తరువాత ఆమెకి జబ్బుచేసింది. అల్లుడు ఇల్లు కట్టిస్తున్నాడు. ఆర్థికంగా కష్టపడుతున్నారు. డబ్బు పంపించమని నాభార్య నన్ను వత్తిడి చెయ్యసాగింది. ప్రతి నెల వంద వంద రూపాయల చొప్పున పంపించసాగాను. ఏడవ నెలలో వంద రూపాయల డ్రాఫ్టు తీసుకొని నా అల్లుడు దేశ

రాజుకు 'కోయటే' కి పంపించమని పురుషోత్తమదాసుకు ఉత్తరం రాశాను. తరువాత నేను రైల్వే పాస్ తీసుకుని నా భార్యతో కోయటేకి వెళ్ళాను. స్టేషన్‌లో దిగగానే ఆమెకి చెప్పాను."వెళ్ళి చూడు! నీ కూతురు మరణిస్తుంది" అని. అమ్మాయి చనిపోయింది. ఇది నా అనుభవం! నా జీవితంలో ఎదురైన మరొక అంశం వివరిస్తాను. నా కొడుకు శాహపదమ్ జంగ్ పుట్టినప్పుడు అతన్ని చూడగానే, నేను ఇతనికి ఇవ్వవలసి ఉంది. ఇతనినుండి తీసుకోవాల్సిందేమీ లేదని అన్నాను. ప్రస్తుతం అతను మూడు వేలు నెలకి జీతం సంపాదిస్తున్నాడు. ఈ రోజు వరకు అతని సంపాదనలో నుండి నేను పైసాకూడా తీసుకోలేదు. తినలేదు. చెల్లెలికి ఏమైనా పంపుతుంటాడు. నేను మాత్రం ఏమీ తీసుకోను. ఒకసారి రష్యా నుండి గడియారం నా కోసం తెచ్చాడు. నేను దానిని కార్ఖానాలో పెట్టాను. ఎవరో ఎత్తుకుపోయారు. అది నాకు తెలిసి, 'మంచిదే అయింది' అన్నాను. ఇలాంటి అనుభవాల ద్వారా నేనొక స్థిర నిశ్చయానికి వచ్చాను. మనం ఒకరినుండి మరొకరం ఇచ్చిపుచ్చుకునే వ్యవహారంలో పూర్వజన్మలలోని కర్మల కారణంగానే కలుసుకుంటూ ఉంటాం. ఒకరు మరొకరికి తండ్రయి పుట్టి అప్పు తీర్చుకుంటాడు. ఒకరు కొడుకై పుట్టి అప్పు వసూలు చేసుకుంటాడు. మరొకరు తోబుట్టువైపుట్టి ఋణానుబంధాలు తీర్చుకుంటారు. ఒక వ్యక్తివలన మరొకరికి కష్టాలు, దుఃఖం, అవమానాలు కలుగుతాయి. ఇవన్నీ పూర్వజన్మ సంస్కారాల, కర్మల ఫలితంగానే జరుగుతున్నాయి. ఎవరూ ఎవర్నీ సుఖపెట్టరు. బాధపెట్టరు. ఈ విషయమే ఈ మనుషులకు బోధపడినట్లయితే ప్రతిదానికి బాధపడటం, అయ్యో ఎంతపనైపోయిందని నిట్టూర్పడాలు ఉండవు. భార్యలతో సరిపడని భర్తలెందరో నా వద్దకి వస్తుంటారు. వారి సమస్య సాంతం విని, మీమీ పూర్వజన్మల సంబంధాల కారణం గానే ఇలాంటి సమస్యలు వస్తుంటాయని చెబుతుంటాను.

మీరు వస్తుంటారు. ఏమిటీలీల అని ఆలోచిస్తుంటాను. ఇవ్వటం-తీసుకోవటం! ఒకరు గురువై తీసుకుంటాడు. మరొకరు శిష్యుడై తీసుకుంటాడు. ఒకరు సోదరుడై వసూలు చేసుకుంటాడు, మరొకరు కొడుకో, చిన్నాయనో అయి తీసుకుంటారు. ఏ బాంధవ్యమూ లేకుంటే, ఏదీ కాకుంటే ఏదొంగో, బందిపోటో అయి పొడిచి మరీ తన బాకీ వసూలు చేసుకుని పోతాడు. ఈ ప్రపంచం ఏమిటి? ఇచ్చి పుచ్చుకునే స్థలం!

లాహోర్‌లో ఒక ప్రముఖ పండితుడు ఉండేవాడు. అతని భార్య నిమ్న స్వభావురాలు, ఆయన అతి గొప్ప జ్యోతిష్యుడు. పెద్ద పెద్ద వ్యక్తులు ఆయన దగ్గరికి వచ్చినప్పుడు అతని ఇంట్లోని వ్యవహారాల్ని, ఆమె గయ్యాళితనాన్ని చూసి, "పండిత్ జీ! ఏమిటి విషయం, మీ భార్య ప్రవర్తన ఇట్లా ఎందుకు ఉంది? మార్చేందుకు ప్రయత్నించరా?"

అని అడిగారు. దానికి ఆయన సమాధానం చెబుతూ "ఏముంది? పూర్వ జన్మ సంస్కార ఫలితం. కర్మఫలితం. బాకీ సంబంధం" అనే వాడు." బహుశా ఆ జన్మలో అప్పట్లో ఆమె పట్ల నేను మూర్ఖంగా ప్రవర్తించేవాడిని కాబోలు! దాని ప్రతీకారం ఇప్పుడామె తీర్చుకుంటోంది. ....." అనేవాడు. నా జీవనంలోని నిజాల్ని, అనుభవాల్ని మీకు చెప్పిపోతానని ప్రతిజ్ఞ చేశాను. ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవటం తప్పదనే అంశాన్ని మీకు బోధపరిచాను. ఇందుకు ప్రమాణంగా నా జీవనంలో ఎదురైన అంశం చెప్పాను. సుభాష్ ద్వారా విన్న విషయం చెప్పాను. మూడవది మరొక ఉదాహరణ చెబుతాను. నేను మ్యానీ స్టేషన్‌లో ఏ.ఎస్.ఎం. గా ఉండేవాణ్ణి. నేను ఏ ఊరికి వెళ్తే అక్కడ ఓ ఫ్యామిలీ డాక్టరును నియమించుకోవడం నాకు అలవాటు. మ్యానీలో ఉన్నప్పుడు నా పర్సనల్ డాక్టర్‌గా డాక్టర్ ఆజ్ఞారాం ఉండేవాడు. అతను పక్కా ఆర్య సమాజికుడు. అయినా జ్యోతిష్యాన్ని నమ్మేవాడు. ఆ రోజుల్లో ఆర్యసమాజం అన్యధర్మాలను సమాలోచన చేసేది. విమర్శలూ గుప్పించేది. నేను ఓ రోజు ఆజ్ఞారాంతో "డాక్టర్ గారూ! ఆర్యసమాజివై ఉండి జ్యోతిష్యాన్ని నమ్ముతావేం?" అని అడిగాను. దానికి సమాధానంగా ఆయనిలా అన్నాడు. "పండిత్‌జీ! నమ్మక తప్పని సంఘటన ఒకటి నాకు తారసపడింది. నేను 'మ్యో' హాస్పిటల్లో చదువుకునేవాణ్ణి. ఒకరోజు అనార్కలీ నుండి వెళ్ళేటప్పుడు ఎవరో గుర్తుతెలియని, అంతకుముందు నేనెక్కడా చూడని వ్యక్తి నా వీపుచరిచాడు. వెనుదిరిగి చూశాను. ఆ వ్యక్తి నల్లగా ఉన్నాడు. నుదుటిపై తిలకం పెట్టుకున్నాడు. అతను నా పేరేమిటని అడిగితే ఆజ్ఞారాం అని చెప్పాను. "ఏం పని చేస్తావు" అన్నాడు. "వైద్యవిద్య-డాక్టరీ చదువుతున్నా"నన్నాను.

"నా వీపుపైన 12 సంవత్సరాలుగా ఓ పుండు ఉంది. విపరీతంగా బాధిస్తోంది. తగ్గటం లేదు. దీనికి కారణం ఏమని ఒక జ్యోతిష్యుని సంప్రదించాను. ఆయన నన్ను బాగా పరిశీలించి నేను ఒక వ్యక్తి నుండి 100 రూపాయలు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వని కారణం వలన నన్ను ఈ పుండు బాధిస్తోందని చెప్పాడు. ఎవరికైతే నేను డబ్బు ఇవ్వవలసి ఉందో ఆ వ్యక్తి ఫలానా రోజున, ఫలానా సమయంలో అనార్కలీలో నీకు కలుస్తాడు. అతని పేరు 'అ' అక్షరంతో మొదలవుతుంది. అతను వైద్యం చదువుతున్నాడు అని చెప్పాడు. ఆవ్యక్తిని అన్వేషిస్తూ వచ్చాను. ఇవాళ నీవు కలిశావు. నేను నీ కివ్వాల్సిన 100 రూపాయలు ఇవిగో! వీటిని తీసుకుని నాకు చికిత్స చెయ్యి" అన్నాడు. అతని మాటలు విని సరదా కోసం అనే అనుకుని ఆ వంద తీసుకున్నాను. కార్బన్ లోషన్‌తో మూడు రోజులు ఆ పుండును శుభ్రంచేశాను. పట్టీవేశాను. ఆ వ్యక్తి పుండు బాధ నుండి కోలుకున్నాడు. ఇక వెళ్ళడానికి తయారై, "పూర్వజన్మ రుణం తీర్చేశాను. మరి

ఇప్పుడు నీవు నాకు వైద్యం చేశావు. దీనికి ఫీజుగా ఇవ్వడానికి నావద్ద డబ్బు లేదు. నీ వివరాలివ్వు. 'జన్మపత్రిక' తయారుచేసి ఇస్తానన్నాడు. నేను నా వ్యక్తి గత వివరాలు, పుట్టిన తేదీ, సమయంవంటివి ఇచ్చాను. అతను నా జన్మకుండలివేసి, జన్మపత్రిక రాసి ఇచ్చాడు. నా జీవనంలో జరిగిన సంఘటనలు, ప్రస్తుత విశేషాలు, భవిష్యత్తు అందులో స్పష్టంగా రాశాడు. ఆయన రాసినదంతా నూటికి నూరుపాళ్ళు నిజమేనని రుజువైంది. అందుకే నేను జ్యోతిష్యాన్ని నమ్ముతాను అన్నాడు ఆజ్జారాం. దీని వలన ఏం నిర్ధారణ అయింది.? మనం ఈ ప్రపంచంలో ఉన్నాం. ఎవరినుండైనా అధికలాభం తీసుకుంటాం. లేదా అప్పు తీసుకుంటాం. తిరిగి ఇవ్వం. మన కర్తవ్యాల్ని నిర్వర్తించం. ఇవన్నీ మన కర్మలుగా మారతాయి. అందుకే నా సత్సంగాల్లో స్పష్టంగా చెబుతుంటాను. నేను అసలు సత్యాన్ని దాచి, పరదాల మాటున ఉంచి మీనుండి డబ్బూ, దస్కం తీసుకుంటే, మిమ్మల్ని మోసగిస్తే ఈపాపం నుండి తప్పించుకోగలనా? కర్మ సిద్ధాంతం ఎవరినీ విడిచి పెట్టదు. ఎవరికైనా ఒక్కటే! నా స్థితి ఏమవుతుందో తెలియదు. నామాటలు అర్థమైనవనుకుంటా! నాకు ఉపన్యాసం ఇవ్వటం రాదు. మనం ఈ ప్రపంచంలో ఒకరికొకరం ఋణగ్రస్తులమని పై ఉదాహరణలవల్ల ఋజువవుతోంది. ఇదంతా ఇచ్చి పుచ్చుకునే సంబంధమే! అందుకే చెబుతున్నాను, "ఓ మానవా! నీ స్వార్థప్రయోజనాల కోసం ఎవరినీ మోసం చెయ్యకు! తిమ్మిని బ్రహ్మినిచేసే దుష్ట ఆలోచనల్ని అమలు పరచకు. ఎవరినీ మోసగించి, అన్యాయం చెయ్యకు. నువ్వు నామదానం పొందావనీ, అభ్యాసం చేస్తావనీ మర్చిపో. ఇవి చేసినంత మాత్రాన నువ్వుచేసే చెడుపనులకి ఫలితం ఉండదనుకోకు. చేసిన కర్మ ఫలితం నుండి ఎవరమూ తప్పించుకోలేం." ఇదే నేను చెప్పదలచుకున్నాను.

ఇక్కడొక మేనేజర్ గారున్నారు. ఆయనకు ఓ కొడుకున్నాడు. 5-6 సంవత్సరాల వాడయ్యాడు. నడవలేడు. మాట్లాడగలడు. ఏమిటిది? పూర్వజన్మలో పరస్పరం ఒకరికి మరొకరు దుఃఖం కలిగించి, కష్ట పెట్టుకున్నందువల్లనే దానికి ప్రతీకారం తీసుకోకతప్పని పరిస్థితులు కల్పించబడతాయి. ఈ ఇచ్చిపుచ్చుకోవడం ముగిస్తే మనిషి క్షణకాలం ఉండడు. వెళ్ళిపోతాడు. అందుకే నేను ఆలోచించి జాగ్రత్తగా వ్యవహరిస్తాను. ఎవరితోనూ మోసపూరితంగా మాట్లాడను. నా స్వప్రయోజనాలకోసం ఎవర్నీ కష్ట పెట్టను. ఇరకాటంలో పెట్టటం, ప్రలోభపెట్టటం, నా లాభాలకోసం హింసించటం, ఉన్నదొకటైతే మరొకటి చెప్పి మసిపూసి మారేడు కాయను చేయటం వంటివేవీ నేను చెయ్యను. ప్రతిపనిలోనూ అధికార అనధికార వ్యవహారాల్ని ఆలోచించి,

విచారించి ఎంతో జాగ్రత్తగా అడుగు ముందుకు వేస్తాను. ఇలా ఎందుకు చేస్తాను? ఎందుకంటే ఈ ప్రపంచంలో కర్మఫలాలను ఇచ్చి పుచ్చుకోవలసే ఉంటుంది. మీరు కొందరు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చారు. నాదొక బాధ్యతగా భావిస్తాను. ఈ పని నిర్వర్తించడం కూడా నా కర్మఫలితమే! నా అనుభవాలలోని అంశాల్ని, పాఠాల్ని చెబుతానని ప్రతిజ్ఞ చేశాను. ఈ కర్మల చక్రం నుండి మనిషి బయటపడటం చాలా కష్టం. తప్పించుకునేందుకు ఏదైనా ఉపాయం ఉందా అనిఆలోచిస్తుంటాను. జీవనమంతా ఈ కర్మల వలయం పరిభ్రమిస్తూనే ఉంటుంది. పుడుతుంటాం-చస్తుంటాం. జన్మించాలి! మరణించాలి! దీని నుండి బయటపడడానికి ఏదైనా ఉపాయం, పద్ధతి ఉన్నదా? దీనిని గురించి సంతులు ఏం చెబుతున్నారు? మీకు స్వామీజీవాణి విన్పిస్తాను.

**" సత్‌గురు శరణగహో మెరే ప్యారే కర్మజగాత్ చుకాయ్"**

ఈ కర్మ ఫలాల నుండి, ఇచ్చిపుచ్చుకునే వలయం నుండి తప్పించుకోదలచితే సత్‌గురు శరణంలోకి వెళ్ళమని స్వామీజీ చెప్పారు. ఏ వ్యక్తి అయినా సతగురు శరణంలోకి వచ్చి ఆయన్ని గురువుగా ధారణచేస్తే, ఆయన నుండి నామదానాన్ని పొందితే ఇతని కర్మలన్నీ నశించిపోతాయా? అని ఆలోచిస్తుంటాను. ఇదొక ప్రశ్న. గురుధారణ చేసినంతమాత్రాన కర్మలు నశించిపోవు. తొలగిపోవు. సత్యజ్ఞానం పేరే సద్గురువు. సత్యమైన అసలైన గుర్రువు చెంత కూర్చొని సత్యజ్ఞానాన్ని ప్రాప్తింప చేసుకుంటే, అసలు విషయం, అంతరార్థం బోధపడితే నీకు నిజమైన సత్యమైన అనుభవం కలుగుతుంది. అప్పుడే నీకర్మల దొంతర కరిగి పోతుంది. తొలగిపోతుంది. ఫకీర్‌చంద్‌నో, మరో గురువునో గురువుగా ధారణ చేసుకున్నంత మాత్రాన సరిపోదు. ఆయన నుండి నామదానం పొందినంత మాత్రాన నీ కర్మలన్నీ నశించిపోతాయనుకుంటే పూర్తిగా పొరపాటే!

**"భూల్ భరమ్ మే సబ్ జగ్ పచ్‌తా**
**అచరజ్ బాత్ వకాహూ షుహోయ్**
**బాగ్ హీన్ సబ జగ్ మాయా బస్**
**యహ నిర్మల్ గతి కోయీూవ పాయ్"**

సత్యమైన జ్ఞానాన్ని, అనుభవాన్ని రహస్యాన్ని సద్గురువు అంటారని మీకు, చెప్పాను. స్వామీజీ ఏమంటున్నాడు? ప్రపంచమంతా భ్రమలలో చిక్కుబడి ఉంది. ఈ సత్యజ్ఞాన గతిని, దాని రహస్యాన్ని తెలుసుకుంటేనే ఎవరికైనా అది ప్రాప్తిస్తుంది.

ఆ రహస్యం ఏమిటి? మన మనసులలో ఎన్ని సంకల్ప వికల్పాలు ఉదయిస్తాయో, ఎన్ని ఆకృతులు ఏర్పడతాయో ఎన్ని రూపురేఖలు, దృశ్యాలు వస్తుంటాయో అదంతా మాయే! వీటి వెనుకపడకండి! వీటిని అనుసరించకండి. అంతరంలో ప్రకాశాన్ని, శబ్దాన్ని ప్రకటించుకోండి. అంత్య సమయం వచ్చినప్పుడు నీ మనస్సులో, అంతరంలో ఏ రూపు రేఖలూ రావు కనుక మనసు తన పరిభ్రమణాన్ని విడిచి నీ సురత్ పారబ్రహ్మ, శబ్ద బ్రహ్మలలోకి ప్రవేశిస్తుంది. దీనివలన ఏమవుతోంది? మనసు వలయంలో, మనసు పరిభ్రమణంలో ఉంటూ నువ్వు చేసిన పాప పుణ్యాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు, కర్మలు ఏవీ అడ్డురావు. ఎందుకంటే నీవు నీ మనో మండలం నుండి, మనోపరిధినుండి బయటపడి, మనస్సు ఆవరణ నుండి బయటపడి ప్రకాశ మండలంలోకి, ప్రకాశ కాంతుల ఆవరణలోకి వెళ్ళిపోతావు. అందుకే ఇక్కడి నియమాలు అక్కడ పనిచేయవు. ఎన్ని తప్పులు, పాపాలు చేసినా చనిపోయే సమయంలో శబ్దం విన్పిస్తే ప్రకాశం కన్పిస్తే నీ కర్మలు ప్రభావం చూపవు. ఎందుకు? ఉదాహరణకు మనదేశంలో ఏదో ఓనేరం చేసి అమెరికాకు పారిపోయావనుకో! ఇక్కడి రాజ్యాంగ నియమాలు అక్కడ వర్తించవు. అక్కడివి వేరుగా ఉంటాయి. కనుక నీవు నేరస్థుడవన్పించుకోక పోవచ్చు, నిన్నెవరూ బంధించరు. ఇలాగే మన కర్మయొక్క వలయం, పరిభ్రమణం మనసు ఆధీనంలో ఉంది. మనసు ఆధీనంలో నుండి బయటపడగలిగినప్పుడే పాప పుణ్యాలు సమాప్తమవుతాయి. అందుకే

**నామ్ రత్తీ ఏక్‌హై, పాప్ జోరత్తీ హజార్।**
**ఆద్ రత్తీ ఘట్ సంచరే, అవుర్ కో సబ్ చార్॥**

నామం ఏమిటి? తనను తాను శబ్ద ప్రకాశాల్లో లయం చేసే స్థితి లోకి వెళ్ళి పోయేదాని పేరే నామం. అయితే ఈ కర్మ నుండి తప్పింప చేయగల విధానం, పద్ధతి ఏమిటి? ఓ నిర్మలా! నువ్వింత ఖర్చుచేసి ముగ్గురు నలుగురు వ్యక్తులతో కలిసి సత్సంగం కోసం బొంబాయి నుండి వచ్చావు! బిడ్డా! నీకు నేను ప్రేమ పంచిపెడతాను. ప్రేమిస్తాను. కానీ నీ అజ్ఞానం, ప్రేమల నుండి అనుచితలాభం పొందదలచుకోలేదు. నువ్వు అమరనాథ్‌లో మునిగేటప్పుడు నేను నిన్ను రక్షించలేదు. అసలీ విషయమే నాకు తెలియదు. ఇవన్నీ నీ మనసు, విశ్వాసాల లీలలే!

శబ్ద, ప్రకాశాలప్రాకట్యాన్నే మీ లక్ష్యంగా ఇష్టంగా నిశ్చయించుకొనండి. మీ దేహాన్ని విడిచి వెళ్ళే సమయంలో మీ ఎదుట ప్రకాశమే కన్పించటం అవసరం. అందుకే ఇప్పటినుండే శబ్దాన్ని వినేటందుకు, ప్రకాశాన్ని చూసేటందుకు సాధన ద్వారా ప్రయత్నాల్ని తీవ్రం చేయండి. ఇదే ప్రకాశ శిక్షణ. ఒక సనాతన ధర్మం గురించి మనకు తెలుసు. మనిషి మృత్యుముఖంలో ఉన్నప్పుడు అతని ఎదుట దీపం వెలిగించి పెడతారు. ఇలా ఎందుకు ఉంచుతారో తెలుసా? కనీసం అదిచూస్తూ ఉంటేనైనా అతనికి తను చేరుకోవలసిన స్థానం ప్రకాశమే నన్న విషయం గుర్తుకు వస్తుందేమోనని! అయితే ఈ కర్మచక్రంనుండి తప్పించే ఉపాయం ఏది? మనిషి తన లక్ష్యం, ఆదర్శంగా శబ్ద ప్రకాశాల్ని మాత్రమే పెట్టుకోవాలి. వాటి సాధన చెయ్యాలి. మనస్సు పరిభ్రమణ చక్రం, వలయం. ఇదంతా కల్పితం, మాయ అనే అంశాన్ని అనుక్షణం గుర్తుంచుకోవాలి. ఈ జ్ఞానం కలుగనంతవరకు లక్ష ఫకీర్‌చంద్‌ల శరణు వేడినా, మరెందరు గురువుల్ని ఆశ్రయించినా నీ నావతీరం చేరదు. ఏ మహాత్ముడూ ఈనాటి వరకు ఇంత స్పష్టంగా చెప్పలేదు. సత్యాన్ని, రహస్యాన్ని ఢంకా మోగించి చెప్పిన తొలి వ్యక్తిని నేనే!

### "సత్‌గురు శరణ గహో మెరెప్యారే
### కర్మ జగాత్ చుకాయే"

"సద్గురు శరణం పొందవదేలా? కర్మఋణంబు తీర్చగరాదా"

సతగురు శరణం అంటే ఏమిటో తెలిసిందా? ఎవరైనా యోగ్యుడైన నిర్బంధపురుషుని సన్నిధిలోకి వెళ్ళండి.

తమ స్వప్రయోజనం కోసం గద్దెనెక్కని నిస్వార్థ గురువు శరణు వేడండి. స్వార్థంతో గురుత్వాన్ని స్వీకరించిన గురువు సత్యమైన మార్గమెలా చూపిస్తాడు.? ఇలాంటి గురువులు ఏం చేస్తారు? ప్రతినెలా వస్తూ ఉండు! గురువుకు డబ్బులిచ్చి వెళ్ళు. నా వలలోనే చిక్కుకుని ఉండమని చెబుతారు. సత్యమైన జ్ఞానం పేరే సద్గురువు నాకు అర్థమైన విషయాన్నే చెబుతున్నాను. కానీ ఇదే అంతిమమని నేననటంలేదు. నాకు బోధపడిన ఈ అంశాలు బహుశా అసత్యం కూడా కావచ్చు. నా అనుభవంలోకి వచ్చిన విషయాలు ఇవే గనుక చెబుతున్నాను. నాది కల్మష రహితమూ, ఎవరినీ మోసగించి, వంచించని మనస్తత్వం గనుక నాకు ఎలాంటి భయమూ లేదు.

**"భూల్ భరమ్‌మే సబ్ జగ్ పచ్‌తా**
**అచరజ్ బాత్ వ కాహు సుహోయ్"**

"భ్రాంతి మరపులో మునిగిన జగము, అద్భుత వచనము ఏల రుచించు?"

నేను సత్యమైన మాట చెబుతున్నాను. ఏ రాముడూ, ఏదేవీ, ఏ ముహమ్మద్ ఎవరి అంతరంలోకీ రారు. ఇవన్నీ నీ మనసులోని సంకల్పాలు, సంస్కారాల లీలలే! నిజాన్ని, వాస్తవాన్ని వినడానికి అర్థంచేసుకోడానికి ఎవరూ సిద్ధపడరు. పారిపోతారు.

**"భాగ్ హీన్ సబ్ జగ్ మాయా బస్**
**యహ నిర్మల్ గతి కోయి వ పాయ్ ...."**

"మాయాలో చిక్కిన భాగ్యహీనులు ఈ నిర్మలస్థితి పొందగలేరు."

నిర్మలగతి అంటే ఏమిటి? నువ్వు మనసు సంకల్పాల్ని పూర్తిగా విడిచినప్పుడు ఏం మిగులుతోంది? ప్రకాశం! అది నిర్మలంగా ఉంటుంది. సమస్త ప్రపంచం భాగ్యహీనమైనదని ఆయన అంటున్నారు.

**"జిన్ పర్ దయా ఆదీ కర్తాకీ**
**సోయహ అమృత్ పీవన్ చాహి"**

"ఆది దేవుని దయ కలిగినదా అమృత పానము అనుభవించగా"

ఎంత సత్యాన్ని చెబుతున్నాడో చూడండి! పరమార్థం అందరిదే అయినా పరమాత్ముని దయ ఎవరిపైన ప్రసరిస్తే వారే దీని వైపుకు వస్తారట. ప్రతివ్యక్తీ రాడట. ఇక్కడ సతగురుదయ కాదు. ఆది కర్తా దయ అని రాశాడు. గమనించండి.

**"కహాఁ లగ్ మహిమా కహూఁ ఇస్ గత్‌కీ**
**విర్‌లే గురుముఖ్ చీనత్ తాహి"**

"ఏమి మహియది ఏమాస్థితియే, గురుముఖులే యది పొందుదురేమో!"

ఈ అవస్థను-ఈ స్థితిని అనగా సత్‌జ్ఞాన ప్రాప్తిని, ఇందులో నిశ్చలంగా నిలువగల స్థితిని ఎవరో నూటికికోటికి ఒక విర్లాగురుముఖి మాత్రమే పొందుతాడని అంటున్నారు. నేను 'సత్' స్థితిని పొందాను. సత్ అయ్యాను. కానీ అక్కడ స్థిరంగా ఉండలేను. నేను మీకు సత్యమైన విషయం చెబుతున్నాను. నాకు ఆ రహస్యం తెలిసిపోయింది. కాని అక్కడ స్థిరంగా ఉండాలన్నా ఉండలేక పోతున్నాను. ఇక

మనసులోకి వచ్చేస్తుంటాను. ఏం చెయ్యాలి ఇది నావశంలోనిది కాదు. "ఇంతగా జీవనయాత్ర చేసి సాధన చేసిన నీవే అక్కడ నిల్చుండలేక పోతావు. ఇక ఈ ప్రపంచంలోని సామాన్యులు అక్కడ స్థిరపడగలరనీ, నిల్వోగలరనీ ఎలా అనుకుంటావు? అని ఆలోచిస్తుంటాను. మీరు గృహస్తులు! ఏం చెయ్యాలి?

**"బిన్ గురు చరన్ అవుర్ వహి భావే**
**ఇస్ ఆనంద్ మే రహే సమాయే ... "**

"గురుపాదము వినామనుసు నిలువదు, ఆ ఆనందమే బ్రహ్మ స్వరూపం."

ఇప్పుడు చూడండి.! గురుచరణాలు అంటే మీరంతా బాహ్య గురువు చరణాలని భావించారు. ఇది కొంత వరకే పరిమితం. కానీ అసలైన గురువు ప్రకాశం. రాధాస్వామి మత సంచాలకుడు రాయ్ సాలిగ్రామ మహారాజ్ తన 'ప్రేమబాణి'లో దీనిని సుస్పష్టంగా రాశారు. సతగురువు ఎవరు? శబ్దస్వరూపి రాధా స్వామి దయాళుడే సత్‌గురువు. ఆయన చరణాలే ప్రకాశం. హిందూశాస్త్రం గాయత్రి మంత్రం కూడా ఇదే చెబుతోంది. సంత్ మతంలో, సనాతన ధర్మంలో భేదమేమీ లేదు. సత్యాన్ని ప్రాపంచికులు ఆచరించరు. అమలు పరచడం అంత తేలిక కూడా కాదు. నా జీవనమంతా సాధనలోనే గడిచిపోయింది. మనసుకు అతీతంగా, దాన్ని విడిచి వెళ్ళి పోవాలని అనుక్షణం కోరుకుంటాను. కొన్నిసార్లు మనసు చంచలమై ఎంత ప్రయత్నించినా ఒక్కసారిగా ప్రకాశ శబ్దాలలోకి వెళ్లలేను. ఇక అప్పుడేం చేస్తాను? స్మరణ చేస్తాను. ధ్యానంలో కేంద్రీకరిస్తాను. ఆ తరువాతే పైకి వెళ్తాను. ఇది కఠినమైనపని. దీనికి ఒక్కటే మార్గం ఉంది. ముందుకు సాగటం! విషయం బోధపడితే నెమ్మది నెమ్మదిగా నడకసాగించు. తపం చేస్తూ ఉండు.

**"దర్శన్ కరత్ పిండ్ సుధ్ భూలీ**
**ఫిర్ ఘర్ బాహర్ సుధి క్యా ఆయే... "**

"దర్శన్ మాయెన పిండము మరచు, ఇంటా బయటా ధ్యాసను విడచు"

చూడండి! బయటకూడా ప్రేమ ఉంది. అంతరంలో ప్రేమ పొంగినప్పుడు స్మృతి, చేతన, మరుపుకు వస్తుంది. ఇల్లూ, పిల్లలూ వంటివేవీ జ్ఞాపకానికి రావు. అభ్యాసం చేస్తున్నప్పుడు నిన్ను నీవే మరిచి పోతావు.

**"ఐసీ సురత్ ప్రేమరంగ్ భీనీ,**

**తిన్ కీ గతి క్యా కహా సునాయే"**

" ప్రేమా మృతమున మునిగిన సురతీగతినేమని వినిపింతునుదాని"

ఇలా ప్రేమతో తనలోకి వెళ్ళే సురత్ చాలా ఉత్తమమైనదనీ దాని గతిని, చలనాన్ని, స్థితిని ఎలా చెప్పగలననీ, అది మాటల కందనిదనీ ఆయన అంటున్నారు.

**"జోగ్, బైరాగ్, జ్ఞాన్ సబ రూఖే,**

**యహ రస్ ఉన్‌మే దీఖే న తాయ్..."**

"యోగి వైరాగి జ్ఞాన జీవులు ఈ రస స్వాదన పొందగలేరు"

ఎవరితో ప్రేమ ఆ పరమతత్వంతో ప్రేమ! ఎందుకంటే ఆ పరమతత్వానికి ఏ రూపమూలేదు. అందుకే ప్రారంభంలో దానిని ఏదో ఒక రూపంగా భావించవలసి వస్తుంది. కానీ నీ జీవితమంతా బాహ్య గురువు వెంటబడే ఉంటే పని జరగదు. మిమ్మల్ని సదా ఫకీర్ చంద్ వెంట బంధించాలని నేను కోరుకోను, నిర్మలా! రేపు ఫకీర్‌చంద్ వెళ్ళిపోతాడు. అప్పుడిక ఏడుస్తారు. తలబాదుకుంటారు. ఇక ఎక్కడికి వెళ్తారు? అందుకే నేను పోయాక మీరు మరొక గురువు వద్దకు వెళ్ళే అవసరం లేకుండా విషయాన్ని స్పష్టంగా ఢంకా మోగించి మరీ చెబుతున్నాను. అసలు విషయం ఇది కాదు. ఇట్లా ఉంటుంది అని వాస్తవాన్ని మీకు చెప్పాను. ఇక మిగిలింది ప్రపంచానికి సంబంధించిన పని. సత్సంగానికి వస్తూంటారు. పోతుంటారు. దీని గురించి ప్రశ్నలేదు.

**"బడ్ భాగీ కోయీ విరలా ప్రేమీ,**

**తిన్ యహ న్యామత్ మిలీ అధికాయ్"**

"భాగ్యవంతులో ప్రేమ జీవులో ఈ ఉత్తమగతి పొందుదురేమో?"

ఆసక్తిగల అదృష్టవంతునికి మూలం అంతుబడుతుంది. నాకు చిన్ననాటినుండి ఒకానొక అంశంవైపు తీవ్రమైన ఆసక్తి ఉండేది. ప్రస్తుతం ఆ స్థానానికి నేను చేరుకున్నాను. ఈ కర్మ యుక్తి నుండి బయటపడే పద్ధతి తెలిసింది. మార్గం తెలిసింది. కానీ శాశ్వతంగా బయటపడలేకపోయాను. అక్కడ స్థిరంగా ఉండలేను. నిజం చెబుతున్నాను.

**"రాధాస్వామి కహత సునాయీ**
**యహ ఆరతి కోయీ గురుముఖ గాయ్"**

"రాధాస్వామి తెలిపెను వినుమా! గురుముఖులేయది పాడుటగనుమా!"

నిర్మలా! నువ్వు పరమార్థం కోసం వస్తుంటావు. అందుకే ఈ రోజు నాకర్తవ్యం పూర్తి చేస్తాను. గురువు హోషియార్ పూర్ లో కాదు నీలో ఉన్నాడు. నా శరీరం గురువు కాదు. గురువంటే జ్ఞానం, వివేకం, బుద్ధి. ప్రారంభంలో సురత్ నేరుగా అక్కడికి వెళ్ళజాలదు గనుక ఏదో ఒక రూపం ఏర్పర్చుకుని సంపూర్ణంగా విశ్వసించవలసి ఉంటుంది. ఆరూపం నీలోపల ప్రకటమయ్యాక అది ఫకీర్‌చంద్ దనో, మరో గురు రూపమనో అనుకోకు. దానిని పరమతత్వం యొక్క రూపం అనుకో. ఇక్కడ దాతాదయాల్ విగ్రహం ఉంది. దానిని కేవలం రాయి, శిల అనైతే అనలేం కదా! అలాగే ఏ రూపం నీవేర్పర్చుకుంటావో దానిని దశరథుని ఇంట వెలసిన రాముడిదనో, గోకులంలో పుట్టిన కృష్ణునిదనో, హోషియార్‌పూర్‌లో ఉండే ఫకీర్‌చంద్‌దనో అనుకోకు. దానిని పరిపూర్ణంగా విశ్వసించి పరమతత్వ రూపంగా నమ్ముకో, అన్నీ లభిస్తాయి. నా గురువు దాతా దయాల్ మరణించాడని నేనేనాడూ ఆలోచించలేదు. అనుకోలేదు. దీనివలన ఏమవుతోంది? నీవు సాధన చేస్తున్నా శబ్ద ప్రకాశాలు అనుభవంలోకి రాలేదు. ఎందుకంటే నీవు ఆ రూపంలో శబ్ద ప్రకాశాల్ని విశ్వసించావు. నీకు మంచి జరుగుతుందనడానికి కారణం నీవా రూపాన్ని శబ్ద ప్రకాశ స్వరూపంగా భావించి, నందువల్లనే! గురు రూపాన్ని గురువుదని నీవు భావిస్తే లక్ష ప్రయత్నాలు చేసినా నీ నావతీరం చేరదు. నీకు ప్రపంచం లభిస్తుంది. సిద్ధిశక్తులు వస్తాయి. అందుకే కబీర్ సాహెబ్

**"గురుకో మామష్ జావతే, తే వర్ కహియే అంధ్**

**దు:ఖీహోయె సంసారమే, ఆగేయమకాఫంద్**

**గురూ కియా హై దేహకో, వత్ గురు చీన్హా నాహిఁ**

**కోహ కబీర్ తాదాస్‌కో, తీన్ పాప్ భర్ మాహిఁ"**

"గురువును మనిషిగ భావించే మనిషి కనులున్నా గుడ్డివాడే!
జగాన అనుభవించును దు:ఖం!! పరానపొందును యముని బంధనం!!!"

నన్ను విశ్వసించిన వారిని అజ్ఞానంలో ఉంచకూడదని ఇవన్నీ స్పష్టంగా చెబుతున్నాను. మిమ్మల్ని మోసగించ దల్చుకొనడం లేదు. నా రూపమే దర్శిస్తున్నట్టయితే నీలో ప్రకటమవుతున్న ఆ రూపం నాదని అనుకోకండి. నేనెక్కడికీ, ఎవరిలోకీ వెళ్ళనని స్పష్టంగా చెబుతుంటాను. మీరు ప్రకటించుకున్న రూపాన్ని సంపూర్ణంగా నమ్మండి. మీ పనులు నెరవేరుతాయి. నేను మార్గాన్ని సులభతరం చేశాను. ఏ కష్టమూ లేదు. మనస్సులోపల రకరకాల విచారాలు వస్తుంటాయి. వీటిని మాయ అనుకోండి! అవునా కాదా? ఇవి కల్పనలే! అంతే! ఇదీ విషయం. వాద వివాదాల ప్రసక్తి లేదు.

బిడ్డా! నీవు నా దగ్గరికి వస్తావు. నా వద్దకేవలం శుభ భావనలు తప్ప ఇంకేం లేవు. నీవు నన్ను బొంబాయికి పిలవాలనుకుంటావు. నేను నా కర్తవ్యాన్ని పూర్తిచేశాను. అయినా ఆరోగ్యం బాగుంటే వస్తాను. ఇన్ని రూపాయలు ఖర్చుచేసుకుని వచ్చావు. నీ బాధ్యతలు చూసుకో. నాపైన ఏ దోషమూలేదు. నేను మిమ్మల్ని మోసగించలేదు. ఎవరితోనూ కపటంగా వ్యవహరించలేదు. ఎవరినీ నా వలలో బంధించే ప్రయత్నం చేయలేదు. ఉన్న విషయం, యథార్థం మీకు చెప్పాను. ఈ ప్రపంచంలోకి మనం ఎందుకు వస్తామనే విషయాన్ని ఈనాటి సత్సంగంలో వివరించాను. ఈ గోపాల దాస్ మా ఇంటికి వచ్చి 30 సంవత్సరాలైంది. ఇతను మొదటిసారి మా ఇంటికి వచ్చినప్పుడు నా భార్యతో అన్నాను. "భాగ్యవతీ! పూర్వ జన్మలో ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం మిగిలి ఉంది. ఇతను మనకు ఋణపడి వున్నాడు. గనుక వచ్చాడు. సేవ చేస్తాడు." అన్నాను. ఇతనూ, ఇతని పిల్లలూ మాకు సేవచేస్తారు. ఇది పూర్వ జన్మ ఋణానుబంధం. నాకు సంతోషమన్పించి ఎవరికైనా ఏదైనా ఇవ్వాలన్పిస్తే ఇచ్చేస్తాను. బహుశా పూర్వజన్మలో నేనితనికి ఋణపడి ఉన్నానేమో అందుకే ఇవ్వాలన్పించింది అని తరువాత అన్పిస్తుంది. నా దగ్గరికి వచ్చేవాళ్ళు ఇచ్చిపోతుంటారు సంతోషంగా. నాకు వీళ్ళివ్వవలసి ఉందికాబోలనుకుంటాను, వీళ్ళంతా వచ్చి నాకు ఇచ్చిపోతే బాగుండు అని నేననుకుంటే అది నాకర్మగా మారుతుంది. ఎందుకంటే నేను నా స్వార్థంకోసం అతనొచ్చి ఇది ఇవ్వాలి, ఇతనివ్వాలి అనుకుని వసూలు చేయడంకోసం తీయని కబుర్లు చెప్పి కపటంతో, టక్కరితనంతో జిత్తులు వేస్తే అది కర్మగా మారుతుంది. స్వాభావికంగా ఎవరైనా వ్యక్తి ప్రేమతో ఏదైనా వస్తువు ఇస్తే అది పూర్వ జన్మ ఋణం తీర్చుకోవడం

అవుతుంది. ఇది ముఖ్యమైన విషయం. వర్ణించటం నాకు రాదు. నేనేం చెబుతున్నానో అర్థం చేసుకొనండి! మనం ఇష్ట పూర్వకంగా సంతోషంతో ఇస్తే, తీసుకుంటే దానివలన పూర్వరుణం సమాప్తం అవుతుంది. కానీ ఏదైనా పనిని స్వార్థంకోసం చేస్తే అది కర్మగా మారుతుంది.!

బిడ్డా నిర్మలా! మీరంతా వస్తారు. మనకందరికీ ఒకరివలన మరొకరికి సుఖదుఃఖాలు కలుగుతుంటాయి. ఇళ్ళలో శాంతి నెలకొనేలా చూడండి. మీకు స్పష్టంగా చెబుతున్నాను. ఎవరూ ఎవరికీ భర్తకాదు. భార్యకాదు. ఎవరూ పుత్రుడు కాదు. ఎవరూ పుత్ర వధువు కాదు. ఎవరూ తల్లికాదు, ఎవరూ చిన్నాన్న కాదు. ఎవరి కెవరూ ఏమీ కారు. ఇది నాలుగు రోజుల ప్రపంచం. ఎప్పటి వరకు లీల ఉందో ఆట ఆడండి! అయితే నీదైన ఒక ఆలోచన ఉండాలి. ఏమని? మీరు నేను ఎవరమైనా సరే! ఇక్కడుండే వాళ్ళం కాదు. ఇది కేవలం నాలుగు రోజుల జీవనం, నాలుగు రోజుల ప్రపంచం, ఇవాళ గడిచింది. రేపు వెళ్ళిపోయింది. ఎల్లుండీ గడుస్తుంది. ఇక తరలిపోక తప్పదు. వెళ్ళి పోతాం. అంతే! ఉన్నదంతానీ మనస్సే. నీ మనసుని సంభాళించుకుని జాగ్రత్తగా వ్యవహరించు. సంతోషంగా జీవనాన్ని గడుపు. పుట్టించినవాడు తినడానికి రొట్టె నివ్వకమానడని మనకు తెలుసు. ఈ సమస్త ప్రపంచం తమ తమ మనస్సుల పరిభ్రమణంలోకే వచ్చి, తమ మనసునడవడిలోనే బంధింపబడి ఉంది. జీవనంలోని మనస్సును ఆలోచనా విచారాలతో బంధించవద్దు. మరణించడానికి ముందు ప్రకాశం, శబ్దంలను పట్టుకో. అంటే వాటినినీ అనుభవంలోకి తెచ్చుకో. సత్యవంతంగా రోజులు గడుపుకో. ఆర్తిగా పిలువు! పిలిస్తే పరమాత్ముడు పలుకుతాడు. ఆయన అందరివాడు. గురువు సదా నీతోనే, నీలోనే ఉన్నాడు. ఆయన నీవాడు. నీవు ఆయన వాడివి. సంసార సాగరం నుండి తరించాలనుకుంటే నీ అంతరంలో సాధన చెయ్యి.

**అందరికీ శాంతి - అందరికీ రాధాస్వామి**

☆

చేయలేరు కదా! కేవలం ధనికులకే దానం చేసే అవకాశం కలుగుతుంది. పై శబ్దంలో దాతాదయాల్ శివవ్రత్‌లాల్ మహారాజ్ ఇలా రాశారు.

**దేహధరాతో దేహతూ, కరమ్ ధరమ్ సత్ జ్ఞాన్ ।**
**కరమ్ ధరమ్ సత్ జ్ఞాన్‌సే ఔర్ కాహో కల్యాణ్॥**

"దేహము దాల్చిన నీవూ, కర్మధర్మ సతజ్ఞానమూ!
కర్మ ధర్మ సత్‌జ్ఞానము వలన, కలుగును జగతికి శుభము!!"

ఏ పని చేసినా అది ఇతరులకి ఉపయోగ పడేలా చూడు! ఇది కర్మదానం. ఆర్థికసాయం చేస్తూ కటువైన పదాలతో ఎదుటి వారిని దూషించి చేస్తే అది 'దానం' అన్పించుకోదు. ఇతరులకి మేలుకలిగించి, సుఖశాంతులు సమకూర్చితేనే అది 'దానం'. జీవనం గడపడానికి మార్గంలేని వ్యక్తికి ఉపాధికల్పించటం కూడా దానమే! దీనివలన అతను అతని భార్యా పిల్లలకు తిండి సంపాదించుకునే అవకాశం కలుగుతుంది. ఇది అన్నిటికంటే ఉత్తమ దానం అనవచ్చు. పూర్వకాలం బ్రాహ్మణులకు దానం చేయాలనే ఒక ఆచారం ఉండేది. విద్యార్జన చేస్తూ పొట్టపోషించుకోలేని విద్యార్థులకు దానం జరిగేది. అప్పటినుండి దానం చేయాలనే ఆచారం వస్తోంది. ఇప్పుడు పాతరోజులు పోయాయి. శ్రీమంతుడైన బ్రాహ్మణునికి దానం చేయటం అనవసరం. కాలానుగుణంగా కొత్త సంప్రదాయాలు, నియమాలు ఏర్పడ్డాయి. జైనులు, బౌద్ధుల కాలంలో భిక్షువులకు సంపాదన లేనందున వారికి అన్నదానం చేయటమనే ఆచారమేర్పడింది. ఏదైనా ఒక వస్తువు అవసరం ఉన్నవారికి ఆవస్తువును అందించటం దానం. తన అవసరాన్ని, ఆశయాన్ని, కోరికని తీర్చుకోలేని అసమర్థునికి అదే అతని దుఃఖకారణమైనప్పుడు ఆ అవసరాన్ని తీర్చి అతని మనసుకు ఊరట, శాంతిని కలిగించటం అన్నిటికన్నా ఉత్తమ దానం.

వృక్షాలు కూడా దానం చేస్తాయి. అవి కార్బన్-డై-ఆక్సైడ్‌ని గ్రహించి ఆక్సిజన్‌ను అందిస్తాయి. చెట్టువలన అనేక లాభాలున్నాయి. అందుకే ఋషులు చెట్లకు నీళ్ళుపోయాలని నియమం పెట్టారు. దానికి పూజలో స్థానం కల్పించారు. చెట్టుకి నీరు సరఫరా చేయటం కూడా దానమేనంటాన్నేను. ఇతరప్రాణికి ఆనందం లభింపచేసేది దానమని నాకన్పిస్తూ ఉంటుంది. నీ దగ్గర ధనం ఉంటే దాని అవసరం ఉన్నవాళ్ళకి ఉపయోగించి వారి కష్టాల్ని ఆర్థిక బాధల్ని దూరం చెయ్యి.

నిష్కామ భావనతో ఇవ్వటం అని దానానికి అర్థం. దానం చేస్తున్న వ్యక్తి సకామ భావనతో దానం చేస్తే అది అది అతని 'కర్మ'గా మారి దాని ఫలితం లభిస్తుంది. స్వాభావికంగానే దానం వలన దాతకు శాంతి సమకూరుతుంది. నీ వద్ద ధనం లేకుంటే, ఇతరుల ఆర్థికావసరాలకు ఆదుకునే శక్తిలేకుంటే చింతించే పనిలేదు. నీ తీయని, మధురమైన మాటల ద్వారా హృదయపూర్వక సానుభూతి ద్వారా వారికి ఉత్సాహం కలిగించు! ఇది కూడా దానమే సుమా!

**దేహ ధరాతో దేహతూ, ముఖసే మీఠే బైన్।**
**ముఖ్‌కే మీఠే బైన్ సే, సబ కోహో సుఖచైన్॥**

"దేహము దాల్చిన నీవూ, మధుర వచనమే పలుకూ!
మధుక వచనముల వలనా! మిగులును సుఖము మనకూ!!"

నీ తీయని మాటలతో ఇతరులకు శాంతిని, సుఖాన్ని, ఆనందాన్ని కలిగించు. ఉత్సాహపరుచు. ఎదుటి వ్యక్తి బాధపడేలా, తలవంచుకునేలా మాట్లాడకు. ఇది కూడా దానమే!

**దేహ ధరాతో దేహతూ, అవురోన్కో సన్మాన్।**
**అవురోంకో సమ్మాన్ సే, తుఝే మిలేగా మాన్॥**

"దేహము దాల్చిన నీవూ పదుగురికందించు గౌరవం!
ఇతరులకిచ్చిన మర్యాద వలన దొరుకును నీకు గౌరవం!!"

ఇతరుల్ని గౌరవించటం దానం. హుజూర్ దాతా దయాల్ మహారాజ్ జీవనం చూశాను. ఆయన ఎప్పుడూ ఎవరిగురించీ చెడుగా మాట్లాడేవాడు కాడు. ఇతరుల్లోని మంచినే చూసేవాడు. నేను పాపినే అయినా నన్నాదరించాడు. నేనాయన దగ్గరికి వెళ్ళేవాణ్ణి. ఆయన నన్నెప్పుడూ దూషించ లేదు. పైగా ప్రోత్సహించేవాడు. ఇదీ దానం! నీవు ఇతరులకి గౌరవ మర్యాదలు ఇస్తే నీకు కూడా అవి ఎదురవుతాయి. ఎదుటివారిని నిందిస్తే నీకు నిందలే ఎదురవుతాయి.

**దేహధరాతో దేహతూ, సత్ గురుకా సత్ నామ్।**
**సత్ గురుకే సతనామసే, పావేగా బిశ్రామ్॥**

"దేహము దాల్చిన నీవూ జపించు సత్‌గురునామము!
సత్‌గురు సత్యానామము వలన పొందెదవులే ఉపశమనము!!"

సత్‌జ్ఞానం అంటే ఏమిటి? గురువు చూపిన మార్గాన్ననుసరించి నడవటం, ఇతరులకు చేసే ఉపకారం దానం. అసలైన దానం అంటే ఏమిటనేది హుజూర్ దాతా దయాల్ మహారాజ్ ఈ పంక్తుల్లో చెబుతున్నాడు.

**దేహధరాతో దేహతూ, ప్రేమప్రీతి పరతీత్।**
**ప్రేమప్రీతి పరతీత్ సే, హోగా తేరా హీత్॥**

"దేహము దాల్చిన నీవూ ప్రేమానురాగాలు పంచుము!
ప్రేమానురాగాలవలన కలుగును నీకు హితము.!!"

ఇతరులను ప్రేమించు. దీనివలన నీకు, ఎదుటివారికి శుభం కలుగుతుంది. ఇదే గృహస్థులు చేయదగిన దానం. ఇది అవసరం. దానమివ్వటమంటే ఏమిటి? బలిదానం ఇవ్వటం! వ్యక్తి తన వ్యక్తిగత ఖర్చును తగ్గించుకుని ఇతరులకి సాయంచేస్తే అది దానం అన్పించుకుంటుంది. ఈ రోజుల్లో కొందరు స్త్రీలు ఐదేసి వందల రూపాయల విలువైన చీరలు కడుతున్నారు. తక్కువ ధరలోదొరికే చీరధరించి మిగిలిన డబ్బును, మేను దాచుకునేందుకు గుడ్డలు కొనుక్కోలేని నిరుపేదలకు వస్త్ర దానం చెయ్యాలి. లేదా ఓ నిరుపేద స్త్రీ అవసరాన్ని కనుక్కొని తీరిస్తే అది గొప్పదానం అవుతుంది.

**దేహ ధరాతో దేహతూ, విద్యాబుద్ధి విచార్।**
**విద్యాబుద్ధి విచార్‌సే, హో సచ్చా ఉపకార్॥**

"దేహము దాల్చిన నీవూ విద్యాబుద్ధి విచారము!
విద్యా బుద్ధి విచారము వలన, అయ్యేను నిజ ఉపకారము.!!"

స్కూళ్ళు, కాలేజీలు తెరిచి విద్యావ్యాప్తికి దోహదపడి, విద్యార్థులకి విద్యాదానం చేసి సాయ పడటం, సద్బుద్ధిని కల్పించటం కూడా దానమే! ప్రోత్సహించటం వీలుకాకుంటే మౌనంగా ఉండాలి. అంతే తప్ప ఉత్సాహం తగ్గించి నిరాశపాలు చేయకూడదు.

ప్రోత్సాహకరమైన ఆలోచనలను అందివ్వటం కూడా దానమే! ఎదుటివారిలో ధైర్యాన్ని పెంచి సంతోషం కలిగించు. ఇక్కడికి ఒక గుడ్డి పిల్లవాడు హరియాణా లోని భవానీ జిల్లా నుండివచ్చాడు. పాపం! ఎంతో ఉదాసీనంగా కన్పించాడు. తను జీవనం గడపటం ఎలా? అనేది అతనికి ఒక పెద్ద సమస్యగా మారింది. నేను అతన్ని

ఉత్తేజపరిచి నిరుత్సాహాన్ని పోగొట్టటానికి "నీకు నెలకు 15 రూపాయలు పంపిస్తాను. ఇదిగో ఈనెల 15 రూపాయలు" అని ఇచ్చేశాను. అతనెంతో సంతోషంగా వెళ్ళాడు. చాలా మంది గురువులకు భక్తులు దానం ఇస్తుంటారు. దాన్ని పేదలకు, ఆర్తులకు ఖర్చుపెట్టని గురువు పాపి. నాకీ సందర్భంలో ఒక సంఘటన గుర్తుకొస్తోంది. నాకు అది బాగా జ్ఞాపకం. నేనొకసారి బాగ్దాద్ నుండి శలవుపై వచ్చాను. హుజూర్ దాతాదయాల్ మహారాజ్‌తో నేను "మీకు ఖర్చులకోసం కొంత పైకం పంపిస్తానని" ప్రార్థించాను. ఆయన "సరే! చాలా మంచిది" అని జవాబిచ్చారు. నేను శలవు ముగిసి బాగ్దాద్ వెళ్ళాక 20 రూపాయల మని ఆర్డరు చేశాను. వాటికి మరో పది రూపాయలు చేర్చి 30/- రూపాయలు నాకు దాతాదయాల్ పంపించారు. వాటిలోకి 20 చేర్చి నేను పంపాను. ఒకరికొకరం పంపుకొంటూ ఉంటే అలా అది 150 రూపాయలు కాగానే నేను "మహారాజ్! ఏమిటిది? ఎందుకిలా చేస్తున్నారు?" అని రాశాను. దానికి ఆయన "తమ్ముడూ! నీ సంపాదనలో నుండి నువ్వు నాకు పంపిస్తున్నావు. మరి నేను సంపాదించే పైకానికి నువ్వు హక్కుదారునివి అవుతావు కదా! నీకు పంపించే హక్కు నాకు లేదా!" అని రాశాడు జవాబు. ఆ తరువాత నేనాయనికి డబ్బు పంపటం మానేశాను.

**శిష్య కో ఐసా చాహియే, గురుకో సర్వస్వదేయ్।**
**గురుకో ఐసా చాహియే, శిష్య కా కుఛ్ నా లేయ్॥**

నేను సంపాదించినన్ని రోజులు నాతండ్రి గారి నుండి గాని, తమ్ముడినుండి గాని, సత్సంగీయులవి గాని, ఎవరి నుండీ నయాపైసా తీసుకోలేదు. ఇప్పుడు నాకొడుకు పదమ్, కట్నీ వాస్తవ్యులు పంపితే తీసుకొంటున్నాను.

నా కొడుకు నాకు 250/- రూపాయలు మాత్రం పంపుతాడు. నా ఇంట్లో ఖర్చు 500 నుండి 550 దాకా అవుతుంది. సరిపోదు. "కట్నీ" వాళ్ళు 250/- పంపిస్తారు. రెండువందలు నా ఖర్చుకోసం కాగా మిగతా 50/- రూపాయలు మందిరానికి ఖర్చుపెడతాను. కట్నీ వాళ్ళు నాకు పైకం ఇస్తామని ప్రార్థించినప్పుడు "ఒక షరతుపై మీకోరిక అంగీకరిస్తాను" అని అన్నాను. మీరు నా నుండి ఆరోగ్యం కానీ, పరమార్థం వంటివాటికి సంబంధించిన కోరికలు కోరకూడదని చెప్పాను. వాళ్ళందుకు అంగీకరించారు. ప్రతినెలా వాళ్ళ దగ్గర నుండి నాకు రూపాయలు అందుతుంటాయి. స్వాభివికంగా, సహజంగానే నా మనసునుండి ఆశీర్వాదం వెలువడుతుంది.

దీని ఫలితం ఏమయింది? ఒకప్పుడు ఆ అన్నదమ్ములు ఇద్దరూ పేదవాళ్ళు. ఇప్పుడు లక్షల రూపాయల్లో మునిగి తేలుతున్నారు. ఈ నగదు గాక ప్రతి సంవత్సరం వాళ్ళు వారి లాభాల్లో నుండి రూపాయికి పైసా వంతున నాకు పంపిస్తారు. వాళ్ళు పంపిన రూపాయలన్నింటిని వారణాసిలోని 'ధాం'కు పంపిస్తాను. గోపాలదాసు పిల్లలు నా దగ్గరుండి నన్ను సేవిస్తున్నారు. వారందరి ఖర్చుభారం నాపైన ఉంది. కట్నీవాళ్ళు డబ్బు పంపటం మానేస్తే మీరు వెళ్ళిపోవలసి ఉంటుందని ముందుగానే వారికి చెప్పాను. ఇంకా ఒకరిద్దరు నాకు నెలనెలా పైకం పంపిస్తుంటారు. ఇంట్లో ఖర్చులకు పోను మిగిలిన సొమ్ము మందిరంలో ఇస్తాను. మందిరం నుండి పేదలకు సాయం అందుతుంది. నాకు పెన్షన్ వస్తుంది. పెన్షన్ రాగానే దాన్ని మందిరంలో ఇస్తాను. ఇది దానం యొక్క ఫలితము. భిక్షం ఎత్తడం దోషమే గాని ..

**బిన్ మాంగే సోదూధ్ బరాబర్, మాంగ్ లియా సోపానీ।**
**రక్త్ బరాబర్ ఉస్ కో జానో, జిస్‌మే ఖీంచాతానీ॥**

ఢిల్లీకి చెందిన మసర్జీ లాల్ కొడుకు వ్యాపారం సరిగ్గా సాగేది కాదు.. అతను నా సత్సంగానికి వచ్చేవాడు. అతనొకసారి నాతో ఒక ఉదంతం చెప్పాడు. ఒక కుక్కపిల్లల్ని పెట్టింది. పిల్లల్ని వదలి అది తిండి తినడానికి కూడా వెళ్ళేది కాదు. ఇంతలో నా భోజనం వచ్చింది. నేను నా భోజనం ఆకలిగొన్న కుక్కకు పెట్టాను''. ... అని చెప్పాడు. ఫలితంగా అతనికి ఏం లభించిందో చెబుతాను వినండి. ఆ సంవత్సరం నలభైవేల రూపాయలు అధిక లాభం వచ్చిందని అతను నాతో అన్నాడు. ఇదే దానఫలం. అవసరం ఉన్నవారికి వారి అవసరం తీర్చాలి. ఒకవేళ నేను మీ నుండి పైకం తీసుకొని నా ఆస్తిని పెంచుకొని నా సంతానానికి ఇస్తే అది పాపమవుతుంది ఇక్కడ మందిరంలో ఎందరో దానం ఇస్తుంటారు. అది దుఃఖితుల కోసం వాడుతుంటాను. దీని ఫలితం మీకు లభిస్తుంది. ఎందుకంటే ఈ సాయం మీ ద్రవ్యంతో జరుగుతుంది గనుక ఫలితం మీకు దక్కుతుంది.

స్వామీజీ తన వాణిలో ఇలా అన్నాడు.

**గురు నహి భూఖా తేరే ధన్‌కా, ఉస్‌పర్ ధన్‌హై భక్తినామ్‌కా।**
**పర్ తేరా ఉపకార్ కరావే, భూఖే వంగేకో దిల్‌వావే॥**

**"దేహధరా తో సేవాకర్ సేవక్ కాయహ ధర్మ్
సేవాకర్ గురు దేవ్ కీ, సమర్థ భక్తికా మర్మ్"**

"దేహము దాల్చిన నీవూ, సేవించు సేవయే ధర్మమూ!
గురుదేవుని సేవించుమూ భక్త మర్మమే తెలియూ!!"

ఇక్కడికి వచ్చిన జన్మించిన ప్రతిఒక్కరూ ఏదో ఒక రోజు వెళ్ళిపోవాల్సిందే! మనం కూడా వెళ్తాము. ప్రజల సొమ్ము ప్రజలకే చెందాలనీ, వారికే వినియోగించాలనీ ట్రస్టు వాళ్ళకు చెబుతాను.

**"దేహధరా అచ్చా భయా దేహ దేహ అబ్ దేహ
ధన్ దేమన్ దే దేహదే, అశరణ కో దే గేహ"**

"దేహము దాల్చిన నీవూ, ఇవ్వుము సకలము ఇవ్వుమూ!
తనువు, మనసు, సంపద అనాథకు శరణం ఇవ్వుము!!"

అసహాయులకు సహాయం అందించు. ఇక్కడ ఉండే జస్వంత సింగ్ కొడుకులు, మనవలు, మనవరాళ్ళు ఉన్నారు. కాని ఎవరూ పట్టించుకోరు. అందుకే ఇతని సేవ చేస్తుంటాను. నేను నా దగ్గర నుండి ఏమీ ఇవ్వను. ఇదంతా మీ పైకమే! నారాయణదాస్ నన్ను సేవిస్తుంటాడు. నేను కూడా ఏదో రూపములో అతని ఋణం తీర్చుకుంటున్నాను. ఇతని ఇంటి నుండి నాకు పాలు వస్తాయి. ఇతను డబ్బులు తీసుకోడు. పైకం మందిరంలో ఇస్తాను. ఇవి ఎవరికైనా అవసరానికి పనికొస్తాయి. అవసరాలున్నవారికి త్రికరణశుద్ధిగా, నిరాశ్రయులకు సేవ చెయ్యి.

**"దేహధరా అఛ్చా భయా జో అవురోన్కే హేత్
అవురోన్కో ఉపకార్ కర్ భవతర్నే కే సేత్"**

"దేహము దాల్చిన నీవూ, ఇతరుల హితమే కోరుము!
నీవొనరించిన ఉపకారమే అగును భవజలధికి వారధి!!"

హుజూర్ దాతా దయాల్ మహారాజ్ నాకు ఇదే చెప్పారు. "ఫకీర్! ఇతరుల కోసం జీవించు" అన్నాడు. మీరంతా పిల్లలు కలవాళ్ళు. పిల్లల్ని పెంచి పోషించడం మీ కర్తవ్యం అని మరువకండి. కాని అతిగా మోహంలో బంధింపబడకండి. నా తమ్ముడి ముగ్గురు పిల్లలు నా దగ్గరే ఉండి చదువుకునేవారు. వాళ్ళ దగ్గర తల్లిదండ్రులు లేరు గనుక నేను వాళ్ళని నా పిల్లలకంటే అధికంగా ప్రేమించేవాణ్ణి. ఇది పరోపకారము.

**"దేహధరాతోదేహఅబ్ జబ్‌లగ్ తేరీ దేహ**
**దేహ దేహదే దేహదే దేహనేహ అవుర్ గేహ"**

"దేహము దాల్చిన నీవూ ఈ దేహమున్నంతవరకు!
దేహమునిమ్ము సేవకు-దేహము స్నేహము గృహము!!"

ఇతరులకు ప్రేమనివ్వు. శరణం ఇవ్వు. శ్రీ గుల్జారీలాల్ నందాగారి ఆలోచన, విచారాల గురించి నాకు తెలియదు. కాని నా అభిప్రాయంలో మందిరం మసీదుల నిర్మాణాలకు రూపాయలు ఇవ్వటం దానం కాదు. పాత రోజులు పోయాయి. ఇప్పుడు మందిరం, మసీదులు కొట్లాటలకు, స్వార్థాలకు నిలయంగా మారుతున్నాయి. మందిరం లేదా మసీదులో ఒక ఇటుకను మూర్ఖంగా ఎవరైనా కదిలిస్తే రక్తపాతం అవుతుంది. అందుకే నీ దానం వల్ల ఎవరికైనా ఉపకారం కలిగితే దానం ఇవ్వు.

**"దేహధరాతో దేహతూ తన్‌మన్ నిజదేహ**
**దేహ ఖేహహో జాయగీ ఫిర్‌కౌన్ కహేగా దేహ"**

"దేహము దాల్చిన నీవూ, తనువూ మనసూ అర్పించుము!
దేహము బూడిద అయ్యాక, ఎవరందురు దీనిని దేహము!!"

మనస్ఫూర్తిగా, ప్రేమతో, నిష్కాముడవై దానం చెయ్యాలి. దానం అడిగే వాడిని మర్యాదగా, గౌరవంగా చూడాలని హుజూర్ దాతాదయాల్ మహారాజ్ చెప్పేవారు. అతను దానం యాచించకుంటే నీకు దానం చేసే అవకాశం రాదు కదా! దానం అందుకునేవాడే లేకుంటే ఎవరికి ఇస్తావు?

**"జీనామర్‌నా ఏక్‌హై దోనో ఏక్ సమాన్**
**నర్ కో జబదేహీ మిలీ, కర్ సబ్ కాకల్యాణ్"**

ఆర్తులకందరికి నీవు సాయపడతావు. నీ చుట్టూరా ముడి పడినవారిని సేవించు. వృద్ధులైన తల్లిదండ్రులను సేవించు. కొందరు స్త్రీలు అత్తమామలకు ఎండిపోయిన రొట్టెలు ఇస్తుంటారు. వాళ్ళను గౌరవించరు. కాని మందిరంలోను, గురుద్వారాలలోను, బాబా ఫకీర్‌వంటి గురువులు వస్తేనో రొట్టెలు, ఏడురకాల కూరలుచేసి పట్టుకెళ్తారు. తినిపిస్తారు. కుటుంబ సభ్యులతో కూడా ప్రేమగా మాట్లాడి సేవలందించు. లోకం ఏమనుకుంటుందోనని అప్పులుచేసి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేస్తారు. కాని ఋణభారం కారణంగా మనసు బాధతో మూల్గుతుంటుంది. అది

దానం కాదు. దానివల్ల మీ అమ్మాయికి కూడా మేలు జరగదు. ఏ ఇంటికి ఆ దానం, ఆద్రవ్యం చేరిందో అక్కడ దుఃఖం, బాధలే మిగులుతాయి. ఆ దానం వలన వాళ్ళకు హాని జరుగుతుంది.

**"నదీ బహై నహి ఆపకో ఫల్ నహి ఖావే పేడ్**
**జోనర్ ఐసా నహిఁహై ఉసేకాల్‌కా ఏడ్"**

చెట్టు తను అందించే ఫలాన్ని భక్షించదు. అందరికి నీరందించే చెరువు తాను నీరు తాగదు. అవి ఇతరులకి ఉపయోగపడతాయి. అందుకే ఇతరులకి ఉపయోగపడటం అలవాటు చేసుకోవాలి. ఇతరులకి బాధలు దూరమై లాభం కలిగేలా దానం, సాయం అందించు. స్కూళ్ళు, కాలేజీలు, తెరిస్తే మంచిదే! దీనివల్ల విద్యాదానం జరుగుతుంది. నీవు పాపివి, దురాచారివి అని ఎవర్నీ నిందించకు. హుజూర్ దాతాదయాల్ మహారాజ్ భయానకమైన మాటలు పలికేవాడు కాదు. దానం చేసేవాళ్ళకు అన్నీ లభ్యమవుతాయి. ఒక కథ వినండి!

**"మర్ జావూఁ మాంగూనహీ, అపనే తన్‌కే కాజ్**
**పరమార్థ్ కే కారనే, మోహిన ఆవే లాజ్"**

**"సంతన్ కా మత్‌హైయహీ, దేహదేహ కుఛ్ దేహ**
**జోనహి దేగా దేహకో, దేహ అంతమే ఖేహ"**

**"లేనా హై సతనామ్ లే, దేనా హై అన్నదాన్,**
**లేనే దేనే కీ సమఝ్ యహ సిద్ధాంత్ మహాన్"**

**"జోనహి దేగా దేహ కో, దేహ అంత్‌మే ఖేహ**
**లేనే దేనే కీ సమఝు యహ సిద్ధాంత్ మహాన్"**

ఒక బ్రాహ్మణుడు చాలా యజ్ఞాలు చేశాడు. కొంతకాలానికి పరిస్థితులు తారుమారై పేదవాడయ్యాడు. ఆదేశపు రాజు దగ్గరికి వెళ్ళి 3,4 యజ్ఞాల ఫలమిచ్చి ద్రవ్యం తీసుకు రమ్మని సలహా ఇచ్చిందతని భార్య. ఇల్లు గడవడానికి మరో ఉపాయం లేదని తోచి అతను సరేనన్నాడు. అతని భార్య ఐదు రొట్టెల్ని అతనికి దారిలో తినడానికి మూటగట్టి ఇచ్చింది. దార్లో చెట్టు కింద కూర్చుని తినడానికి మూట విప్పాడు. ఇంతలో ఓ కుక్క అక్కడికి వచ్చింది. దాని వెంబడి ఐదు చిన్న చిన్న కుక్క పిల్లలున్నాయి. బ్రాహ్మణుడు ఒక రొట్టెను కుక్కకు వేశాడు. అదితిని మళ్ళీ వచ్చింది.

అతను మరో రొట్టె వేశాడు. ఈ విధంగా ఐదు రొట్టెలు కుక్కకు తిన్పించి తాను ఆకలితో మిగిలిపోయాడు. తరువాత ప్రయాణమై రాజుగారి దర్బారుకు వెళ్ళాడు. తన పరిస్థితి వివరించి 3,4 యజ్ఞాల ఫలాన్ని తీసుకొని బదులుగా కొంత పైకం ఇవ్వమని అడిగాడు. రాజుగారు తన సభలో ఉన్న ఓ యోగిని సలహా అడిగినాడు. మర్నాడు రమ్మనమని సలహా ఇచ్చాడతను. రాజుగారు ఆమాటే చెప్పారు. మర్నాడు ఆ బ్రాహ్మణుడు రాజు దర్బారుకు వెళ్ళినప్పుడు అతనితో రాజ పురోహితుడు "నీవు మొన్న-అంటే ఇక్కడికి ప్రయాణమై వస్తూ దార్లో చేసిన యజ్ఞఫలితం ఇవ్వు. కోశాగారం తెరిచి ఉంచాం. నీ ఇష్టం వచ్చినంత ధనం పట్టుకు వెళ్ళు'' అన్నాడు. "నేనే యజ్ఞం మొన్న చేయలే''దని బ్రాహ్మణుడు ఆశ్చర్యంగా అన్నాడు. "మొన్న నీవు కుక్కలకు రొట్టెలు దానం చేసి నీవేమో ఆకలితో ఉన్నావు. దాని ఫలితం ఇవ్వు'' అన్నాడు యోగి. కాని బ్రాహ్మణుడు అది మాత్రము సాధ్యపడదనీ, ఇవ్వలేననీ నిరాకరించాడు.

నన్ను ఎందరో మోసగించి పైకం తీసుకు పోతుంటారు. జలంధర్ నుండి నా దగ్గరకు ఒక వ్యక్తి వచ్చి ఏడవసాగాడు. తన ఉద్యోగం పోయిందనీ, పిల్లలు ఆకలితో ఉన్నారనీ చెప్పటంతో నేను 200/- ఇచ్చి పంపాను. అతను మోసగాడని ఆ తరువాత తెలిసింది. ప్రపంచంలో ఎన్నో రకాల వ్యక్తులుంటారు. కానీ వారిలో చిత్తశుద్ధి వుంటే దాని ఫలితం తప్పక లభిస్తుంది. మోసగాళ్ళకు నష్టమే మిగుల్తుంది. దానికి అర్హులెవరని తెలుస్తున్నది? నిన్ను ఎవరైనా మోసం చేసినా ఆ తరువాత అతను మరొకరి చేతిలో మోసపోక తప్పదు.

## "జో ఠగేగా వహఠగా, జాయేగా నిస్సందేహ ఆప్,
## ప్రేమీజన్ హీ పాతేహై వస్తు ప్రేమ కీ బహుమూల్ సబ్''

ప్రతిరోజూ దానం చేయండి. కొంచెం అయినా సరే ప్రతి రోజూ దానం చేయండి. ఒకేసారి వెయ్యి రూపాయలిచ్చే దాని ఫలితం కంటే రోజు ఇచ్చే పైసా, పైసా దానానికి ఫలితం ఎక్కువగా ఉంటుంది. ఋషులు, బ్రాహ్మణులు అందుకే పూర్వం ఒక నియమాన్ని పెట్టారు. రొట్టెలు చేసేటప్పుడు మొదటి రొట్టెను ఎవరికైనా ఇచ్చేవారు. బ్రాహ్మణులు భోజనానికి కూర్చున్నప్పుడు ముందుగా కాకులకు, పక్షులకు, కుక్కలకు, ఆవులకు మొదటి ముద్ద ఎత్తి పెట్టేవారు. ఇది రోజూ చేయగల దానం. నీవు 10 లేక 20 వేల రూపాయలు ఇస్తే నీ పేరు పేపర్లో రావచ్చు. నోటీసు బోర్డులో కన్పించవచ్చు. ఇలా ఇవ్వ వద్దని నేనన్నను. ఇందులో కూడా లాభం ఉంది. కాని దానం చేసేటప్పుడు కుడి చెయ్యి చేసిన దానం ఎడమ ,చేతికి తెలియకూడదు. ప్రచారాలు ఉండకూడదు. ఇది మంచి పద్ధతి.

ఒకప్పుడు బ్రాహ్మణులు దానం చేసేవారు. విద్యార్థులకు విద్యాదానం చేసేవారు. సన్యాసులు, ముస్లిం. ఖాజీలు, మౌల్వీలకు, భిక్షువులకు దానం ఇవ్వటం వంటి నియమాలేర్పడ్డాయి. ఆయా సమయాల్లో వాళ్ళు అర్హులుగా లెక్కింపబడేవారు.

ప్రస్తుతం గురువులకు, సంతులకు దానాలిస్తుంటారు. గురు ఖజానాను నింపితే గురువులు తమ పదవులు, కోశాగారం తమ సంతానానికి ఇచ్చి పోతున్నారు. ఇది తప్పని గాని, ఒప్పని గాని నేననను. శరీరాన్ని త్యజించేముందు శిక్షణని మార్చమని. దాతా దయాల్ నన్ను ఆదేశించాడు. అందుకే చెబుతున్నాను.

**"గురుబిన్ మాలాఫేర్‌తే గురు బిన్ దేతేదాన్**
**గురుబిన్ నామ్ హరాంహై జాయ్ పూఛోవేద పురాన్"**

**"గురుబిన్ దేతే దాన్"**

కు అర్థం నీ పిల్లల కడుపులు మాడ్చి దానమివ్వమని కాదు. గురుబిన్ దాన్ అనగా అర్థం నాకు తోచిందేమంటే ఏదానం చేసినా నేను పైన చెప్పినట్టు చేయండి. జనుల పైకం తినే గురువులు అసలైన గురువులు కారు. సమయం మారిపోయింది. ధర్మ పంథాకి పాత పద్ధతులు పనికి రావు.

నందాగారూ! దానం విషయంలోనా అభిప్రాయం వ్యక్తం చేశాను. ఇది తప్పో ఒప్పో నాకు తెలియదు. నేను గురువునై చూశాను. శిష్యుడినై చూశాను. నా కళ్ళు తెరుచుకున్నాయి. మీ వల్ల కాదగిన మేలు ఏది ఉన్నా ఎదుటి వారికి చెయ్యండి.

అమాయకులైన గృహస్థుల్ని అజ్ఞానంలో ఉంచి సత్యం చెప్పక తాము బాగు పడే గురువులున్నారు. ప్రతి ఒక చారిటబుల్ ట్రస్టు లెక్క పత్రాల్ని సరిగ్గా ఉండేటట్టు చూడాలి. జనతకు నిష్కామ భావంతో దానం చేస్తే ఫలితం దక్కుతుంది. గురువులు అజ్ఞానంగా ప్రజల సొమ్ము తిని జీవనాన్ని నష్టపరుచుకుంటున్నారు. ఏ గురువైనా స్వయంగా సంపాదించుకోలేని స్థితిలో ఉంటే తిండి, గుడ్డ కోసం తీసుకుంటే దోషం లేదని నా అభిప్రాయం.

అందరికీ శాంతి-అందరికీ రాధాస్వామి.

☆

# హుజూర్ పరమసంత్ పరమదయాల్

# పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్ సత్సంగం

# మానవతామందిరం - హోషియార్‌పూర్

## 6-11-1980

## దుఃఖం

రాధాస్వామి!

**బ్యా**స్ నుండి వెలువడే 'సారీ దునియా' అనే పత్రికలో హుజూర్ బాబా సావన్ సింహజీ మహారాజ్ తన సత్సంగంలో "సునో భాయియో మేరే దుఃఖడే" ... అని అన్నాడని రాశారు. "సునోభాయియో మేరే దుఃఖడే."... అని నేను కూడా అంటున్నాను. ఆయన అనుభవంలోకి వచ్చిన దుఃఖం మరొకటి కావచ్చు! 'దుఃఖం' ఎవర్నీ విడిచి పెట్టడం లేదు. "భగవంతుడు నన్ను ఈ సత్సంగీయుల నుండి కాపాడనీ.... " అని దాతా దయాల్ తన చివరి రోజుల్లో నౌనిద్ధ్‌రాయ్ అనే సత్సంగికి ఉత్తరం రాశాడు. ఇక నా దుఃఖం, కష్టం ఎలాంటిది? మీలో ఎవరైనా ఒకరికొకరు విరుద్ధంగా చెబుతుంటే నాకు బాధనిపిస్తుంది. అంతేకాదు! మీరొచ్చి నన్ను అవతార పురుషుణ్ణనీ, భగవంతుడిననీ, మీకు ఆపదల్లో సాయపడ్డాననీ నన్ను ప్రశంసించినప్పుడు దుఃఖం కలుగుతుంది. ఆ పొగడ్తలను విని నేను సంతోషించి, మిమ్మల్ని అలాగే ప్రశంసించనిస్తే అది నా జీవనం భ్రష్టమవడానికీ, చెదిరిపోడానికీ కారణం అవుతుంది. స్తుతి, ప్రశంస, నింద అన్నీ దుఃఖ దాయకములే! అందుకే నా జీవితంలో యధార్థమైన పనులే చేశాను. భయంకరంగానో, రోమాంచితం కలిగించేలానో కాకుండా సుస్పష్ట శబ్దాలలో నాకు బోధపడిన విషయాన్నే వివరించాను.

ఇక నా దుఃఖాల గురించి వినండి. కొన్ని సంవత్సరాల క్రితం ఒక పీఠాధిపతి నాకొక ఉత్తరం రాశాడు. తను అంతరంలోకి వెళ్ళినప్పుడు అక్కడ మహర్షి దాతాదయాల్ జీ కనిపించి "ఫకీర్ చంద్‌కు చెప్పు! అభ్యాసం ఎక్కువగా చేయమనీ, అందరినీ ప్రేమించమనీ, అందరికీ ప్రేమను పంచమనీ" అని తనకు చెప్పాడని ఆ ఉత్తరంలోని సారాంశం. "నీలోకి ఎవరూ రాలేదు. ఇది నీ మనస్సే! ఏదైనా నా గురించి

చెప్పాలనిపిస్తే మహర్షి దాతాదయాల్ జీ నేరుగా నాకే ఎందుకు చెప్పలేదు?ఆయనకు ప్రియమైన వాడిని నేనా? నువ్వా''? అని ఆయనకు జవాబు రాశాను. ఈ విషయమే పుస్తకంలో రాశాను. ఇది విని ఆ పీఠాధిపతిగారి సింధీ శిష్యునికి కోపం వచ్చింది. అతను నాకు అపశబ్దాలతో నిండిన ఓ లేఖ రాశాడు. ఏ తిట్టూ వదలకుండా తిట్టాడు. కింద "సింధీ" అని సంతకం ఉంది. కానీ తన చిరునామా రాయలేదు. ఈ ప్రపంచం ఏమిటి? సత్యాన్ని వినడానికి ఏ వ్యక్తీ సిద్ధంగా లేడు.

కొన్నాళ్ళ కిందట ఇక్కడ జరిగిన విశ్వహిందూ సమ్మేళనానికి 'బటాలే'కి చెందిన ఓ ప్రధానోపాధ్యాయుడు హాజరయ్యాడు. ఆయన మానవతామందిర సంస్థాపకుడు ఫకీర్‌చంద్ హిందూజాతికి శత్రువు అని ప్రసంగించాడట! అది విన్న వాళ్ళెవరో "ఆయన చేసిన శత్రుత్వం ఏమిటి?'' అని నిలదీయగా "ఫకీర్‌చంద్ తన స్కూల్లో చేర్చుకొనే పిల్లల తల్లి దండ్రులతో ముగ్గుర్ని మించి పిల్లల్ని కనబోమనీ, ఒకవేళ అప్పటికే అంతకన్నా ఎక్కువగా ఉంటే ఇక పైన సంతానాన్ని కనబోమనీ రాయించుకుంటాడు. ఈ రకమైన నియమాలు విధిస్తే కొంతకాలానికి హిందూజాతి సంఖ్య తగ్గిపోతుంది. ఇతర జాతులవారు మనపై అధికారం చలాయిస్తారు.'' అని జవాబిచ్చాడట. ఏ రాజనైతిక దృష్టికోణంతో అతనీ మాటలు అన్నాడో దానితో నేను ఏకీభవిస్తాను. కానీ ఫకీర్లకు, సంతులకు ఈ రాజనైతిక విచారాలతో, ఆలోచనలతో ఎలాంటి సంబంధమూ లేదు. ఉండదు. ఎవర్నీ నిరుత్సాహపరచటం నా అభిమతం కాదు. అందుకోసం నేను సంత్ మతంలోకి రాలేదు గనుక ఇకపై ఈ నిబంధనను రద్దుచేస్తాను. ఇవన్నీ దు:ఖాలే కదా!

నిన్న లుథియానా నుండి ఒక వ్యక్తి నాకు ఉత్తరం రాశాడు. అందులో ఏం రాశాడో తెలుసా? "నేను శిక్షణని మార్చాను. ఎవరి ఆంతర్యంలోకి వెళ్ళను అని మీరంటూ ఉంటారు. గురునామం జ్ఞానం, వివేక,బుద్ధి, ప్రజ్ఞలదనీ చెబుతుంటారు. ఈ మాటలు మీరివాళ కొత్తగా చెబుతున్నవేంకాదు. ఇంతకు ముందే ఈ వాక్యాల్ని కబీర్ సాహిబ్ చెప్పాడు.

**"గురుకియహై దేహకో, సతగురుచీన్హానాహిఀ**
**కోహే కబీర్ తాదాస్‌కో, తీన్ తాప్ భర్ మాహిఀ"**

కబీర్ మాత్రమే కాదు. సనాతన ధర్మం కూడా **"గురు అఖండమండలాకారం"** అని చెబుతోంది. ఇది రాసి, "మీరు కొత్తగా చెప్పినదేమిటి? ఏం కనిపెట్టారని? ఇదంతా పెద్దలు ఏనాడో చెప్పారు కదా!'' అంటూ అతను నాపై చీవాట్లు, విమర్శలు గుప్పించాడు.

ఇది నిజమే! కానీ ప్రస్తుతం ఈ సత్యాన్ని ఎవరు తలచుకుంటున్నారు? వీటిని జ్ఞాపకం చేసే సత్సంగం ఏది? పుస్తకాల్లో రాసింది ఎంతమందిని చేరింది? నలుగురికీ తెలిసేలా ఎవరు చెబుతున్నారు చెప్పండి. గురువు చూపిన జ్ఞాన మార్గంలో ఎవరు నడుస్తున్నారు? ఎవరూ దానిని పాటించనందువల్లనే వివశుడినై స్పష్టంగా చెప్పక తప్పటం లేదు. ప్రస్తుతం గద్దె నెక్కిన వాళ్ళంతా మనల్ని వారివారి వలల్లో చిక్కించుకునే ప్రయత్నాలే చేస్తున్నారు. జీవికి స్వేచ్ఛ నిప్పించాలని ఎవరూ ప్రయత్నించరు. దీని పరిణామంగానే మనలో పక్షపాతాలు, కొట్లాటలు పెరుగుతున్నాయి. "నువ్వేం చేశావు ఫకీర్‌చంద్!" అని నా ఆత్మను నేను ప్రశ్నించుకుంటూ ఉంటాను. ఈ పని చేయటంవలన నీకేం లభించింది? తలపై కష్టాలు, దుఃఖాల భారం అదనంగా పడింది. కొందరు అనుచితంగా ప్రశంసిస్తే, మరికొందరు దోషం వెదికే ప్రయత్నంగా రంధ్రాన్వేషణ ప్రారంభిస్తారు. ఈ కారణాల వలన నేను బాధపడినా నా అనుభవాల్ని చెప్పిపోతానని వాగ్దానం చేశాను గనుక చెబుతున్నాను. శిక్షణలో మార్పు తెమ్మని దాతా నన్ను ఆజ్ఞాపించాడు. ఇక ప్రస్తుతం ఈ సంత్ మత శిక్షణలు భారతదేశంలో అమలు కాకుంటే, ఆచరించకుంటే దీని స్థితి ఏమవుతుందో చూడండి. ధార్మిక పక్షపాతాలు, ద్వేషాలు ఉండవద్దని వీళ్ళంతా అంటున్నారు. కాని ఇదెలా కుదురుతుంది? లాలూచీ చూపించో, భయపెట్టో హిందూ-ముసల్మానులను కూడగట్టగలవు కానీ ఈ ధర్మాల వేర్లు ఉన్నంతవరకు నీవు వీరిని ఒకటిగా ఏకత్రితం చేయలేవు. 1921లో మహాత్మాగాంధీ హిందువులకీ, ముస్లిములకీ ఒకే గ్లాసులో నీళ్ళందించి తాగించాడు. ఆయన ఇలా ఎందుకు చేశాడు? స్వరాజ్యం, స్వతంత్రలను ఇరువర్గాలకీ ఎరచూపాడు. 1947లో ఏం జరిగింది? హిందువులు, సిక్కులు కలిసి ముసల్మానుల తలలు నరికారు. ముస్లిములంతా హిందూ, సిక్కుల తలలు నరికారు. దాతా నాపైన బాధ్యత ఉంచారు గనుక "ఇన్సాన్ బనో" 'మనిషివి కావాలి' అనే నినాదం ఇచ్చాను. "ఓ మనిషీ' నువ్వు ఆలోచించు! నీవెవరు? ఎక్కడి నుండి వచ్చావు? ఎక్కడికి వెళ్తావు? సంత్ మతం అందించిన ఈ శిక్షణ జనుల్లోకి వ్యాపించకుంటే మీరు లక్ష ప్రయత్నాలు చేసినా ఈ ధార్మిక ద్వేషాలు దూరం కావు. సంతుల ఉద్దేశం ఏమిటో, వాళ్ళీలోకంలోకి ఎందుకు వచ్చారో, చెప్పడానికే నేనీపని నిర్వహిస్తుంటాను. సంతులు ప్రపంచంలోకి మానవజాతి ఐక్యత, మత ఐక్యత **(Unity of Humanity & Unity of Religion)** కోసం, మానవుల భ్రమలు సంశయాలు దూరంచేసి మనిషి ఎక్కడి నుండివచ్చాడో అక్కడికి చేర్చడానికి వస్తారు. ఈ ధర్మాలు, సంప్రదాయాలు, పంథాలు, సామాన్యులకు

సత్యాన్ని చూపించలేదు. దాని పరిణామంగా ద్వేషం మొదలైనవి బయల్దేరాయి. నిజానికి మనం అధికారం, ధనం, గౌరవంకోసం పనులు చేస్తుంటాం. కొందరు గురువులని తప్పుడు విధానంతో ప్రశంసిస్తూ ఉంటారు. కొందరు తమను తాము గురువుగా చెప్పుకుని జనుల ఎదుటికి వస్తారు. ఇట్లా ఎందుకు చేస్తారు. కేవలం తమ గౌరవం, ప్రతిష్ట, డబ్బుకోసం! అనేక ధర్మాలవాళ్ళు పంథాల వాళ్ళు మన గృహస్థుల్ని మూర్ఖుల్ని చేసి దోచుకున్నారు. ఈ ధర్మాలవారు, పంథాలవారు, మహాత్ములు, గురువులు మన ఆచరణని, కర్మల్ని సవరించేయగల శిక్షణని ఇవ్వని కారణంగానే జీవులు అనేక రకాల కష్టాలనుభవిస్తున్నారు. బాధలు పడుతున్నారు. హిందువులు కర్మవిధానాన్ని నమ్ముతారు. కానీ మనం ఉదయం నుండి సాయంత్రం వరకు ఏ కర్మలు చేస్తున్నామో వాటిగురించి ఎవరూ ఆలోచించరు. ఆచరించటం వలన మేలు జరుగుతుందనే అంశాన్నే నేను పదే పదే చెబుతున్నాను. కేవలం రామ రామ అంటూ జపించటం వలన లేదా గురు-గురు అని తిరగటం వలన నీది గానీ, మరెవరిదైనా గాని ఉన్నతి-ఉద్ధారం జరగదు. ఉదయం నుంచి సాయంత్రంవరకు మాల తిప్పుతూ జపం చేస్తున్నావనీ, చెవుల్లో వేళ్ళతో సమాధిలో ఉంటాననే అంశాల్ని తల్చుకుని మురిసిపోకు. అభ్యాస సాధనల సమాధిలో కూర్చున్నందున సంతోషం, ఆనందం కలుగుతాయి. కానీ నువ్వుచేసిన కర్మల ఫలితాల నుండి తప్పించుకోలేవు. అందుకే ఓ మనిషీ! నీ మనసును పవిత్రంగా, శుద్ధిగా ఉంచుకో. మనసులో చెడు విషయాలు రానీయక నీ ఆచరణ, కర్మలను సరైనవిగా ఉంచుకో. నువ్వు లక్షమంది గురువులను ఆశ్రయించినా, దేవుళ్ళ శరణువేడినా నువ్వు చేసిన కర్మఫలితాల నుండి తప్పించుకోలేవు.

నేను నా దు:ఖాల్ని, సమస్యల్ని చెప్పాను. అనవసరంగా ఎందుకీ కష్టాల్లో, ఇబ్బందుల్లో చిక్కుకుని, సమస్యల్ని తలకెత్తుకుంటావని నన్ను నేనే హెచ్చరించుకుంటూ ఉంటాను. విమర్శల్ని ఎటూ భరిస్తున్నాను. అలాగని చెప్పి పొగడ్తలకి పొంగిపోతే నా పరిస్థితి అధోగతి పాలవుతుంది. ఇదంతా నా కర్మ. దాతాదయాల్ భగవంతుని అవతారమో కాదో తెలియదు. కానీ నేనాయన్ని భగవత్ స్వరూపం అని పరిపూర్ణంగా విశ్వసించాను. నేనాయన్ని నమ్ముకున్నాను గనుకే స్వయంగా చిక్కుబడి పోయాను. మాటకు కట్టుబడిపోయాను. ఆయన నాకు ఇచ్చిన ఆజ్ఞను శిరసావహించడం తప్పనిసరై పోయింది.

ఆయన

**"తేరా రూప్ హై అద్భుత్, అచరజ్**
**తేరీ ఉత్తమదేహీ**
**జగ కళ్యాణ జగత్‌మే ఆయా,**
**పరమ దయాల్ సనేహీ"**
**"నీదు రూపమే అద్భుతఠి, అపూర్వం**
**ఉత్తమమైనది దేహం**
**జనహితమునకే జన్మించితివి**
**పరమ దయాలా స్నేహపాత్రుడా!"**

అన్నారు. ఇప్పుడాయన ఆజ్ఞను పాటించకుంటే నాఅంత:కరణ నన్ను క్షమించదు. ఆ పవిత్ర విభూతి నీపైన ఇంత దయ చూపించి, అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానం ప్రసాదించాడు. నీవు ఆయన ఆదేశం పాటించకుంటే దోషివని నిలదీస్తుంది. ఆయన మాటను జవదాటి దోషిని కాలేను. అందుకే నా ప్రాణం ఉన్నంతవరకు ఈ పని చేస్తాను. విమర్శలతో, విరోధాలతో నాకు ఏమాత్రం భయం లేదు. పొగడ్తల అవసరం అంతకంటే లేదు. ఈ పనులు చేస్తున్నందున నేను సుఖంగాలేను. వ్యర్థంగా దోషాలు చూపించాలని కొందరు ప్రయత్నిస్తుంటారు. నా ఎదుటికి వచ్చి విమర్శిస్తే, తప్పులు చూపిస్తే ఒప్పుకోవడానికో, సమర్థించుకోడానికో నేను సిద్ధంగా ఉన్నాను. కానీ ఎవరూ ఎదుటికివచ్చి విమర్శించరు.

ప్రస్తుత పీఠాధిపతులు, సంత్ మతానుయాయులు నేనిలా స్పష్టంగా చెబుతుంటే ఇష్టపడటం లేదు. కబీర్ సాహెబ్, స్వామీజీలు కూడా ధర్మాలను, ఋషులు, మునులను విమర్శించారు. మరి సనాతన ధర్మమతానుయాయులు అదిచూసి బాధపడలేదా? నా జీవితమంతా గుండెని రాయిచేసుకుని ఈ మాటల్ని సహించేందుకు ప్రయత్నించాను. కబీర్ సాహెబ్, స్వామీజీలకు అందరినీ, అన్నింటినీ విమర్శించే హక్కు ఎవరు ఇచ్చారు? వాళ్ళ విమర్శ నూటికి నూరుపాళ్ళు సరైనదనేనని నాకు ఇప్పుడు బోధపడింది. ఏ నియమంపై వాళ్ళు ఈ విమర్శ చేశారో అదే నియమం పై వర్తమాన సంత్ మతానుయాయులు విమర్శకి యోగ్యులు. ఎక్కడ ఈ తప్పు జరుగుతున్నదో వారిని చైతన్యవంతుల్ని చేస్తూ మేల్కొల్పుతాను. నా మాటల్ని మీరు అర్థం చేసుకున్నారనుకుంటాను. గద్దెల నెక్కిన ఈగురువులు శిష్యులకి వాస్తవాన్ని చెప్పకపోవడం వలన వారిలో పక్షపాతాలు, విభేదాలు వస్తుంటాయి. గురు మతం

అంటే ఏమిటి? గురు రూపం ఏమిటి? గురువని ఎవరిని అంటారు? గురువంటే ఎవరు? అనే అంశాలేవి వీరు వారికి బోధించలేదు. స్పష్టంగా చెప్పలేదు. అందుకే ఈ పక్షపాతాలు, విభేదాలు ఏర్పడినాయి.

నాలో వచ్చిన అనేక రూపాలు నా మనసు కల్పనలేననీ, నా మనస్సేననీ తెలిసి నమ్మకం కలిగాక ఆ గురువు లేదా భగవంతుని రూపం గురించి నాకు తెలిసిపోయింది. గురు రూపధ్యానం ద్వారా నా వద్దకు వచ్చిన గురువు మరెవరో కాదు. నా మనసు చిత్రించుకున్న, ఏర్పర్చుకున్న రూపాలే తప్ప అసలైన గురువు రాలేదు. ఈ జ్ఞానం కలిగినప్పటి నుండి నేను మనసును విడిచి పెట్టి పైకి వెళ్ళి పోతుంటాను. ఆ తరువాత ఇంకా ముందుకు సాధన సాగితే అక్కడ శబ్దం, ప్రకాశం ఉన్నాయి. ఆ ప్రకాశ శబ్దాల్లో ఏ వస్తువైతే ప్రకాశాన్ని చూస్తున్నదో శబ్దాన్ని వింటున్నదో దానిని అన్వేషిస్తాను. కొన్నిసార్లు ఒకానొక స్థితి ఏర్పడుతుంది. అక్కడ నేను లేను. నీవు లేవు. గురువు లేడు శిష్యుడు లేడు. స్వామి లేడు సేవకుడు లేడు. మన అస్తిత్వం ఉంటుంది. ఆ స్థితే మనకు అది. మొట్టమొదటిది! అదే గురువు. అయితే గురువు మనని విడిచి వేరుగా ఎప్పుడూ లేడు. మనలోనే ఉన్నాడు. ఈ వాస్తవం గుర్తించక భ్రమ, అజ్ఞానాల కారణంగా బయట పరుగెత్తి, పరుగెత్తి వెదికేవాణ్ణి. ఏ హరిద్వార్‌లోనో, ఏ పీఠం పైనో దొరుకుతాడని భావించేవాణ్ణి. అయితే బాహ్య గురువుయొక్క కర్తవ్యం ఏమిటి? ఆయన జీవుల భ్రమలను తొలగించి అంతరంలోని అసలు గృహానికి మార్గం చూపించాలి. నీ సద్గురువు నీలోనే ఉన్నాడు సుమా అని విశ్వాసం కలిగించాలి. ఆ జీవుడిని అతని రూపంలోనే స్థిర పడేలా చేయాలి. ఇలా వ్యవహరించి తన శిష్యుని ఈ స్థాయి వరకు చేర్చే గురువును బాహ్య గురువని అంటారు.అతనితో ఇతనికి ఉండవలసిన సంబంధం ఇంతవరకే! ఏ వ్యక్తి అయినా దీనిని మించి బాహ్య గురువుని పట్టుకుని వేలాడితే అతను మూర్ఖుడు. ఏ గురువూ ఎవరికీ పుత్రుడినో, మరో వరాన్నో ఇవ్వడు. ఏది లభించినా అది ఆ వ్యక్తియొక్క విశ్వాసం, శ్రద్ధ, నమ్మకాల ఫలితమే! ఈ ప్రపంచంలో ధర్మాల కలహాలలో ఏమేం జరుగుతున్నాయో చూశాము. ముసల్మానులలోపల మహమ్మద్ లేక హజరత్‌ఆలీ ప్రకటమయ్యాడు. వాళ్ళు ఆలీయే దర్శనమిచ్చాడనుకున్నారు. ఇలాగే హిందువులు రాముడు లేక కృష్ణుడు లేదా బాబా ఫకీర్ వచ్చాడని భావించారు.ఈ విధంగా అజ్ఞాన కారణంగా బుద్ధి అనగా మాయాచక్రంలోకి వచ్చి మానవ జాతి చీలి పోయింది. ఈ చీలిక పరిణామం ఏం జరిగిందో పాకిస్తాన్ విభజన సమయంలో చూశాం. ధార్మిక కలహాలలో ఏం జరుగుతోందో

చూడండి.! ఈ దశను చూసి నేను వాస్తవాన్ని, సత్యాన్ని విప్పి చెప్పాను. దీనివలన అర్థం చేసుకోగల వ్యక్తులు అర్థం చేసుకుని ప్రచారం చేస్తే ఈ ధార్మిక కలహాలు ఉండవు. ఈ కలహాలు ఎందుకు వస్తాయి? ముసల్మానులకు ముస్లిం తత్వం అంటే ఏమిటో తెలియదు. హిందువులకు హిందుత్వం గురించి తెలియదు. అందుకే కలియుగంలో సంతులు అవతరించి పిలుపునిస్తారు. సంతులు ఫకీర్ల దగ్గర హిందూ ముస్లిములనే తేడాలు ఉండవు. ఎందుకంటే వారు అందర్నీ ఆత్మ స్వరూపులుగా, దైవ సంతానంగా భావిస్తారు.

ఇక మిగతాది నేను శపథ పూర్వకంగా చెబుతున్నాను. శుభభావనలు తప్ప నేను ఎవరికీ ఏమీ ఇవ్వను. సత్యమైన జ్ఞానం ఇచ్చి సత్యమైన విషయం చెప్పగలను. ఎవరికైనా ఏమైనా లభిస్తే అది వారి వారి విశ్వాసాల ఫలితమే! విశ్వసించిన వారి పనులు నెరవేరుతాయి. నా ఆత్మపై భారం పడకూడదనీ, నేను నా ప్రాణాన్ని రక్షించుకోవడానికి స్పష్టంగా చెబుతున్నాను.

లుథియానాకి చెందిన ఆ సజ్జనుడు రెండవ ప్రశ్న రాశాడు. అదిలా ఉంది. "మీరు నామదానం ఇవ్వకపోవడానికి కారణంగా జబల్‌పూర్‌కి చెందిన ఓ మహిళ ఉదంతం చెబుతారు. జబల్‌పూర్ స్త్రీకి సంతానం చనిపోయే విషయం ఆమె నుదుటిరాతలోనే ఉందనుకోవచ్చుగదా! ఆమె కర్మమే అలా ఉందనుకోవచ్చు. ఆ పిల్లల ఆయుర్దాయం స్వల్పంగా ఉందనుకోవచ్చు. ఆమె సాధకురాలు. సాధనచేసుకోనీయకుండా పిల్లలు విసిగిస్తున్నారని వారిని ఆమె విసుక్కున్న అశుభ భావనవల్లనే పిల్లలు చనిపోయారనీ లేదా ఆమె తప్పుడు విధానంతో నామ జపం చేసినందునే పిల్లలు చనిపోయారనీ ఏమిటి సాక్ష్యం? అని ఆయన నిలదీస్తూ రాశాడు! నిజమే! ఆయన చెప్పిందీ ఒకరకంగా సత్యమే. ఏది జరగాల్సి ఉన్నదో అదే జరిగింది. మరణం కబళించినప్పుడు దానికి ఏదో ఒక కారణం ఏర్పడుతుంది. ఆమె పిల్లలు చనిపోవాల్సే ఉందేమో? వారి ఆయువు స్వల్పమే నేమో? ఆ స్త్రీ చేసిన సాధన-సంకల్పం ఆ పిల్లల మృత్యువుకి కారణంగా మారింది. ఏది జరిగినా దానికి ఏదో ఓ కారణం ఉంటుంది. నా మాటల్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి! నేను మీకు చెప్పదలచుకున్నదానికి సరైన పదాలు మాటలు నాకు దొరకటం లేదు. ఒక వ్యక్తికి ఒక సంఘటన జరిగింది. అతనికిది జరగాల్సి ఉండి జరిగింది. కానీ దానికి సాకు కారణం మరొకటి ఉంటుంది. ఆమె పిల్లలు ఎలాగూ చావాల్సి ఉంది! తప్పుడు పద్ధతిలో చేసిన

అభ్యాసం దీనికి కారణంగా మారింది. ఆ ప్రశ్నకు ఇది జవాబు. నా తెలివి పనిచేసినంతమేరకు చెబుతున్నాను. నాకు ఉత్తరం రాసిన వారికి, విమర్శించి, రంధ్రాన్వేషణ చేయబూనిన వారికి చెబుతున్నాను. కర్మప్రభావం నుండి ఎవరూ తప్పించుకోలేరు.

**"కరమ్ జోజో కరేగా తూ,అంత్ మే భోగ్‌నాపడనా"..**
**"ఏ ఏ కర్మచేస్తావో చివరికి దాని ఫలితం అనుభవించాల్సిందే!"**

వేదాలు, శాస్త్రాలు కూడా "శుభ సంకల్పమస్తు" అనే చెప్పాయి. కాని వాటిని ఎవరు వింటారు? హిందువులు ప్రతిదినం సంధ్యావారుస్తారు. "ఓ ప్రభూ! ఎవరితో మేం శత్రుత్వంచేస్తున్నామో లేదా ఎవరైతే మాతో శత్రుత్వం చేస్తున్నారో, మా ఇద్దరిలోని శత్రుభావనని కాల్చివేసెయ్యి" అని అందులోని ఒక మంత్రానికి అర్థం. హిందువులు, ఆర్యసమాజికులు, సనాతనులు అందరికీ కేవలం మంత్రాలు చదవడమే తెలుసు. వాటిలోని అర్థం తెలియదు. తెలిసినా ఆచరించరు. వీరంతా శత్రుత్వాన్ని దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారా? పాత సారాయిని కొత్త సీసాలో పోసినట్లు సనాతనులు చెప్పిన విషయాన్నే మీకు మళ్ళీ చెబుతున్నాను. మన ఋషులు చెప్పిన శుభ సంకల్పమస్తు వంటి పాత సంస్కారాల్ని కొత్త మాటలలో ప్రవేశపెట్టాను. నాకు అర్థమై చెప్పిన విషయం తప్పు కావచ్చు కాని నేను తప్పని అనుకోవడానికి నా హృదయం ఒప్పుకోదు. నాపైన ఒక బాధ్యత ఉన్నది. దానిని నిర్వర్తించాను. "ఓ భారతదేశ ధార్మిక నేతల్లారా! ప్రాపంచీకులారా! ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ధార్మిక ద్వేషం, పరస్పరం వైరుధ్యం, నిర్దయ, ప్రస్తుత రాజనీతి, ఈ విరోధాలు, వైరభావనలు మీ ప్రాణాల్ని హరిస్తాయి. రక్తాన్ని పీలుస్తాయి. చూడండి ! ఇప్పుడే సరిచేసుకోకుంటే మీ ఇష్టం. దెబ్బతిన్న తరువాత సంభాళించుకోవడానికి ఎలా వీలుపడుతుంది?

**"అబ్ పఛతాయే క్యాబనే, జబ్ చిడియా చుగ్‌గయీ ఖేత్"**
**"పంటగింజలను పక్షులు తిన్న తదపరి-చింతించి ఏమిటి లాభం?"**

ఏది జరగాలని ఉందో అది జరిగి తీరుతుంది. కర్మగతి తప్పదు. ఇలా చెప్పవలసి రావడం కూడా నాకర్మగతిలోనిదే, ఇది నావశంలో లేదు.

మీరంతా వచ్చారు. నాకు ఉపన్యాసం ఇవ్వటంరాదు. నా మనోభావనలని చెబుతుంటానంతే! సంతైనా కానీ, పరమ సంతైనా కానీ, అవతారమైనా కానీ ప్రతి

మనిషి ఏదో ఒక పొరపాటుచేస్తాడు. శరీరంలోకి, మనసులోకి వచ్చిన మనిషి ఎప్పుడు పరిపూర్ణుడు కాడు. తప్పులు అందరూ చేస్తారు. మరి పరిపూర్ణుడూ, దోష రహితుడు ఎవరు? ఆ పరమతత్వాధారుడు ఒక్కడే పరిపూర్ణుడు. జీవించి ఉన్నంతవరకు ఆయనకు శరణాగతులమయ్యే ఉండాలి. శరణాగతం అనుకోవాలి. ఫకీర్‌చంద్‌నో లేక మరో గురువునో కాదు. కేవలం ఆ పరమ తత్వాధారుడి నొక్కణ్ణే విశ్వసించండి!

కొన్నిసార్లు బాధతో ఏడుస్తుంటాను. ఓ నా చెల్లెళ్ళారా! తల్లుల్లారా! తమ్ముళ్ళారా! నేను అర్థం చేసుకున్నదంతా తప్పేకావచ్చు. నేను చెప్పేదే సరైనదని నేను వాదించను. నాకు బోధపడిన విషయాలే చెప్పాను. నేను చేసింది తప్పేనని అనుకుంటే ఏం చేయగలను? బాబా సావన్ సింగ్ లేదా దాతా దయాల్ లకే తెలియాలి. వారే నాకీ పనిని అప్పగించారు. నేను సత్యప్రియవాదిననీ, సదా సత్యమే చెబుతాననీ వారి మనో నేత్రానికి తెలియనిదా? వాళ్ళు నాకీపని ఎందుకు అప్పగించారు? నా మనసు పరిశుద్ధమైనది. కల్మషరహితమైనది. చెడుభావనలకు అతీతమైనది. నేనేది చెప్పినా సత్యమైన హృదయంతో చెబుతాను. ఇతరుల మేలుకోసం చెబుతాను. నేను తప్పుగా చెబుతున్నానని ఎవరైనా అనుకుంటే అనుకోనీ! నా సత్సంగానికి రమ్మని నేనెవర్నీ ఆహ్వానించను. ఇక ఇప్పుడీ ఉత్తరం రాసిన వ్యక్తికి కూడా "నా పుస్తకాలెందుకు చదువుతుంటావు! చదవకు! నా దగ్గరికి రావద్దు" అని చెప్పదలచుకున్నాను. మీరొస్తారు. నాపై ఒక బాధ్యత బరువు ఉన్న భావన కలుగుతుంది. నేడు దు:ఖాల్ని మీకు చెప్పాను. కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు నా గురువాజ్ఞను పాటిస్తాను. లోకులు నన్ను విమర్శించినా, వేలెత్తి చూపించినా, పూల దండలు మెళ్ళోవేసినా పనిచేయడం ఆపను. మానను. ఆగితే నాధర్మం పూర్తిచెయ్యలేను. నాపైన బాధ్యత ఉంది. "గురు ర్వాక్యం-మూలమంత్రం"! నా గురువు ఆదేశాన్ని జీవితాంతం ఆచరిస్తాను. 1942లో బాబా సావన్ సింగ్ జీ మహారాజ్ దగ్గరికి వెళ్ళాను. "మీరనుమతిస్తే నాపైగల బాధ్యతను దింపుకుంటాను" అన్నానాయనతో. "ఎందుకు?" అన్నాడాయన. "నేను సత్యప్రియవాదిని సత్యమే చెబుతాను.". అన్నాను. "ఫకీర్! సత్యం చెప్పడం నావలన కాలేదు. అసలు పరమార్థాన్ని అందరికీ విప్పి చెప్పలేకపోయాను. నువ్వు నిర్భయుడివై పనిచెయ్యి. నీకు నేను సంరక్షకుడిగా ఉంటాను." అని ఆయన నా వీపుపై చెయ్యితో తట్టాడు. తల నిమిరాడు. ఇది ఆయన దయ. నేటివరకు ఈ గద్దెలెక్కిన వాళ్ళు నాకే హానీ కలిగించలేదు. ఆయన దయే లేకుంటే వీళ్ళంతా ఏం చేసేవారో తెలియదు.

నా గురించి మీరేమైనా అనుకోండి నాకు ఫరవాలేదు! మీకు మనసైతే నా సత్సంగానికి రండి! లేదా మానేయండి! నేను ఏ మార్గంలో నడిచానో అదే చెప్పవలసి ఉంది. నేనెవరినీ బతిమాలి మచ్చిక చేసుకోను. ఎవరికీ భయపడను. కేవలం సత్యమే చెబుతాను. రాధాస్వామి దయాల్ లేదా కబీర్ సాహెబ్, మన సనాతన ధర్మ శాస్త్రాలు చూపిన అంశాల్నే చెబుతున్నాను. నేను ఇంటినుండి ఏదో ఒక కొత్త వస్తువును తేలేదు. మీరంతా వస్తారు. గురుధారణ చేశామనీ, గురువే అన్నీ చూసుకుంటాడనీ నిశ్చింతగా ఉండకండి. మీ ఆచరణ సరిగ్గా లేకుంటే గురుధారణచేసినా ఒకటే, చేయకపోయినా ఒకటే!

చూడండి! ఒక విషయం చెబుతాను. మీ అంతరంలో ఉదయం, సాయంత్రం సత్య సంధతతో ప్రార్థించండి! నువ్వే రూపంలో నీ ఇష్టదైవాన్ని విశ్వసిస్తున్నావో ఆ రూపాన్ని ఎదుట పెట్టుకొని నిన్ను నీవు అతనికి సమర్పించుకో. నీలో సత్య సంధత ఉంటే ప్రకృతి నీకు అన్ని రకాలుగా సాంసారికంగా, పరమార్థికంగా, ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సహాయం అందిస్తుంది. ఇది నా జీవితానుభవం. ఏదో ఓ రూపాన్ని నమ్ముకో. దానిని పరిపూర్ణంగా విశ్వసించు. నీ అన్ని పనులూ నెరవేరతాయి. లేదంటే నేను దీనికి జవాబుదారీ అవుతాను. ఇక్కడా అక్కడాఎందుకు తిరుగుతుంటావు. మనసులో ఎలాంటి సంకల్పం, కోరిక, అభీష్టం ఉంటే అలాంటి మనోరథం సిద్ధిస్తుంది. జనులకు వారివారి విశ్వాసం, సత్యమైన ప్రేమ, శ్రద్ధల ఫలితం లభిస్తుంది. నేను గానీ, మరో గురువుగానీ ఎవరికీ ఏమీ ఇవ్వం. నీలోనే అన్నీ ఉన్నాయి. నీ శరీరంలోనే ప్రపంచం ఉంది. రాముడు. కృష్ణుడు, దేవీ, గురువు అందరూ నీలోనే నిండి ఉన్నారు. సత్యవంతుడివి కావటము ముఖ్యం. నీ అంతరంలో ప్రార్థన చెయ్యి. అడుగు. ఆ భగవంతుడు ఇస్తాడు. ఎల్లవేళలా నీతోనే ఆయన ఉన్నాడు. ఉంటాడు. ఇది నాకు అర్థమైనది! ఒంటరిగా కూర్చున్నప్పుడు నీ అంతరంలో ప్రార్థించు, పిలువు! ఒకవేళ నీ బాధలు దూరం కాకుంటే నేను బాధ్యుణ్ణి! నన్నడగండి!

**అందరికీ శాంతి - రాధాస్వామి**

★

# పరమసంత్ పరమదయాల్
# పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్ సత్సంగం
# మానవతామందిరం - హోషియార్‌పూర్
# 17-7-1981
# ఫకీర్ అంతిమ గురుపూర్ణిమ వచనములు

రాధాస్వామి!

మీరంతా వచ్చారు. నాకు మొక్కారు. డబ్బులు, బట్టలు ఇచ్చారు. బాగుంది. "ఫకీర్ చంద్! ఈ సాలెగూడును నువ్వెందుకు ఏర్పర్చుకున్నావు?" అని నా ఆత్మను నేను ప్రశ్నించుకుంటాను. మిత్రులారా! నా బాల్యంలో పరమాత్ముని కలుసుకోవాలన్న కాంక్షతో బయల్దేరాను. నేను హిందువుని. సనాతన సంప్రదాయాల్ని, ధర్మాల్ని అనుసరించి ఈశ్వరుని, పరమేశ్వరుని, బ్రహ్మను, దేవీ దేవతలను నమ్మేవాణ్ణి. భగవంతుని దర్శించాలన్న తపనతో ఒకసారి 24 గంటలపాటు ఏకధాటిగా ఏడ్చేశాను. ఆ తరువాత భగవంతుడు అవతారాలెత్తుతాడన్న విషయం గుర్తుకు వచ్చింది. "నానావిధి రామ అవతారా-రామాయణ శతకోటి అపారా" అన్నారు రామాయణంలో ఆ రాముడిని మానవరూపంలో దర్శించాలనే కోరిక నాలో కలిగింది. ఒక దృశ్యం నన్ను దాతాదయాల్ చరణాలలోనికి తీసుకు వెళ్ళింది. ఆయన దగ్గరికి నేను వెళ్ళినప్పుడు నాకు ఈ సంత్ మతాన్ని ఇచ్చాడు. సంత్ మత గ్రంథాల్ని చదివినప్పుడు నా మనసు సహజంగానే గాయపడింది.

**ఇక్ పురుష్ అజాయబ్‌పాయా-కోయి మర్మన ఉస్ కాగాయా ॥1॥**
**బిన్ సంత్ హోథ్ నహిఁ ఆయా, ఋషిముని సబ్‌ధోఖా ఖాయా ॥2॥**
**క్యావ్యాస్ వశిష్ఠ్ భులాయా, క్యాశేష్ మహేష్ భ్రమయా। ।3॥**
**పారాసర్ యోగీ నారద్, శృంగీ ఋషి గోతా ఖాయా ॥4॥**
**హమ్ కహేఁ కౌన్ సమఝాయీ, పరతీత్ న కోయీలాయా ॥5॥**

**సంతన్ యహ భాఖ్ సునాయా, కోయి గురుముఖ్ బూఝ్ బుఝాయా॥6॥**
**ఘట్ ఘట్ మే కాల సమాయా, శృతి స్మృతి జాల్ బిఛాయా ॥7॥**
**ఖట్ శాస్త్రర్ బుద్ధి చలాయా, అంధే మిల్ ధూల్ ఉడాయా ॥8॥**
**కుఛ్ హాథ్‌న ఉన్‌కే ఆయా, బిన్ సతగురుభట్‌కా ఖాయా ॥9॥**
**సంతన్ వహదేశ్ జనాయా, తబ తుచ్ఛ జీవ భీపాయా ॥10॥**
**నీచోన్కో ఘాట్ లగాయా, ఊన్చోన్కో కాల బహాయా ॥11॥**
**రాధాస్వామి పతా బతాయా, ఖోజీకీ కమర్ బంధాయా ॥12॥**

సంతుమతం మనిషిని ఎక్కడినుండి ఎక్కడికి చేరుస్తుందో చూడండి ఈ అజాయబ్ పురుషుని-అంటే ఆ విచిత్ర పురుషుని అన్వేషణలోనే నా జీవితమంతా గడిచింది. ఈ శబ్ద్‌లో-సంత్‌వాణిలో స్వామిజీ మహారాజ్ అన్ని మతాలనూ విమర్శించాడు. ముసల్మానులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, సనాతనులు ఎవరూ ఈ అజాయబ్‌పురుషుని సన్నిధికి చేరలేదంటున్నారాయన. అంతేకాదు; రామకృష్ణులను కూడా కాలుని అవతారాలని చెప్పాడు. నా సద్గురువు దాతా దయాళుని పట్ల నాకు ఏనాడూ విశ్వాసం సడలలేదు. అయితే ఆ పంక్తుల అంతరార్థమేమిటో నాకేమీ బోధపడలేదు. ఈ సంత్‌మతం మార్గంలో నేను సత్య సంధుడినై నడుస్తాను. నాకు ఏది లభించినా ఏం బోధపడినా, ఏ జ్ఞానం కలిగినా అది ప్రపంచానికి, పదిమందికి అందించి, చూపించి మరీ పోతాను అని నేను అప్పుడే ప్రతిజ్ఞ చేసుకున్నాను. రెండవది. నా ఈ తనువు త్యజించేలోగా శిక్షణలో మార్పులు తీసుకు రమ్మని నా దాతా దయాళు నన్నాదేశించారు. చూడండి! సంత్‌మతం మానవుని ఎంతటి స్థానానికి చేరుస్తుందో! అజాయబ్ పురుషునిఅన్వేషణకై నా జీవితాన్ని వెచ్చించాను.

ఈ ప్రపంచాన్ని సృజించిన వాణ్ణి సంతులు క్రూరుడనీ నిర్దయుడనీ అన్నారు. ప్రపంచ సృష్టికర్తను నమ్మి, పూజించే నావంటివాడికి పై వాక్యం ఎంత కష్టం కల్గిస్తుందో ఊహించండి. బాధనిపించినా దాతాపై నా విశ్వాసం తగ్గలేదు. ఆయనే నాకు ఈ సంత్‌వాణిని చదవమని ఇచ్చారు. ఇప్పుడు నేనుకూడా ఆ పైవాక్యం నిజమేననే నిర్ధారణకి వచ్చాను. ఈ ప్రపంచాన్ని విరచించినవాడు నిజంగా క్రూరుడే, నిర్దయుడే! ప్రతి ఒకరూ తమ విషయాన్నే ఆలోచించుకోవాలి. నా కూతురు ఉన్నది. ఆమె సగం పిచ్చిది. ఆమె వయస్సు ఇప్పుడు 65 సంవత్సరాలు. నా ఇంట్లోనే ఉంటుంది. దీనికి బాధ్యులెవరని ఆలోచిస్తుంటాను. దానికి నేనే బాధ్యుడినని నేను

ఒప్పుకుంటున్నాను. నా బలహీనతలు ఆలోచనా విచారాల ప్రభావం మా అమ్మాయిపై పడ్డాయి. పడ్డాయా లేదా? మరినేను క్రూరుడిని కానా? మనం మన స్వార్థం కోసం, ఆనందంకోసం పిల్లల్ని కంటాం. పిల్లలు కావాలన్న ఆలోచనతో కాదు. పిల్లలు పిలవని బంధువుల్లా వచ్చేస్తారు లోకంలోకి. వారిలో కొందరు టి.బి.తో మరణించవచ్చు. మరికొందరు కేసులు నడుపుతారు. కొందరు చక్రవర్తులే కావచ్చు. ఎలాగైతేనేం? దుఃఖాలనుభవిస్తుంటారు. ఒకే అమాయక ప్రాణిని లోకంలోకి తెచ్చిపడేసి బాధలపాలు చేస్తున్నామా లేదా? మరి మనం క్రూరులమే కదా! నేను నిజం చెబుతున్నానా అబద్ధం చెబుతున్నానా అని ఆలోచించండి! ఈ ప్రపంచాన్ని సృజించిన శక్తికూడా తన ఆనందం కోసం ఈ సృష్టిచేసింది. చెట్టు మొలిచింది. దానిని పురుగులు తింటాయి. చెట్టులో ప్రాణం లేదా? ఒక పురుగు మరొక పురుగును తినటం చూస్తుంటాం. రాత్రి పడుకునేటప్పుడు ఈగలో, దోమలో కుడుతుంటాయి. డి.డి.టి. చిలకరించమని చెబుతుంటాను. అవి చచ్చిపోతుంటాయి. ఈ ప్రపంచంలో ఏమున్నది?

ఈ ప్రపంచంలో సుఖం లేదని నమ్మకం కలిగిన వారికోసమే ఈ రాధాస్వామి మతం లేదా సంతు మతం ఉంది. ఇక్కడ సుఖం, దుఃఖం రెండూ ఉన్నాయి. వీటినుండి తప్పించుకుని, తమను తాము రక్షించుకోదలచినవారికోసమే రాధాస్వామి మతం ఉన్నది. లోకంలోని అన్నిరకాల మనుషులకు ఈ మతం వంటబట్టదు. సంతుమతం ప్రపంచంలోని అందరికోసం కాదు. అందరికీ అర్థంకాదు. నేను అందుకే నామదానమివ్వను. నా దగ్గరికి వస్తున్న వాళ్ళంతా ప్రాపంచిక కష్టాల నుండి తప్పించుకోవడానికే వస్తుంటారు. నిన్న ఒక వ్యక్తి వచ్చాడు. ఇద్దరు మహిళలు ఏడుస్తూ వచ్చారు. 12 సంవత్సరాల కావస్తోంది. పిల్లలు కలగలేదని చెప్పారు. నేను నవ్వాను. అసలు తత్వాన్ని తెలుసుకోవడానికి, నిజగృహానికి చేరుకోవాలనే తపనతో నా దగ్గరికి వచ్చే వాళ్ళెవరూ లేరు. ప్రాపంచిక కోరికల్ని కోరడానికే నా దగ్గరికి వస్తారు. ఈ ప్రపంచంలో ఏముందసలు? ఇది కష్టాలకు నిలయం. పుడుతున్నాం చస్తున్నాం? ఎన్నాళ్ళీ అవస్థ మనకు అని ఆలోచించేవారి కోసం, పరిజ్ఞానం కలిగినవారి కోసమే ఈ సంతుమతం. అందరికీ కాదు. ప్రపంచానికి కాదు. రాధాస్వామి మతం లేదా కబీరు మతాలకు చెందిన గురువులం వాస్తవాన్ని వదిలేసి ప్రాపంచిక మోహాల్లో చిక్కుకున్నాం. నాల్గవ పదంలోని నామాన్ని స్వీకరించి కూడా ప్రాపంచిక పనులలోనే మునిగి తేలుతున్నాం.

ఈ ప్రపంచంనుండి దాటిపోవాలనుకునే వాళ్ళు, విముక్తులం కావాలనుకునే వాళ్ళు ఎవరూ లేరని నాకు అర్థమైపోయింది. పునర్జన్మ వద్దనుకునే వాళ్ళు ఎక్కడో కోటికొకరు అరుదుగా ఉన్నారు. అందుకే నేను నా ఆశ్రమం పేరు సాధారణ జనతకోసమని "మనుష్యబనో" "ఇన్సాన్‌బనో" "బీ మ్యాన్" అని పెట్టాను. ఇక మరి మనిషి అంటే ఎవరు?

**"గురుపశు్రతియా పశువేద పశు వరపశుసంసార్**
**మానుష్ తాహి జానియె జామె వివేక విచార్"**

సత్యమైన వివేకం, తెలివి, బుద్ధి ఉన్నవాళ్ళే మనుషులు. వాటి ఆధారంతోనే జీవనం గడుపుతుంటారు వాళ్ళు. వివేక శక్తి కలిగి తెలివి, అర్థంచేసుకునే యోగ్యత సాయంతో ప్రపంచంలో పని చేసేవాడు మనిషి అని నాకు బోధపడింది. నేను చెప్పేదే ఫైనలని నేను ఎప్పుడూ అనను. నా కర్తవ్యం నిర్వహించుకోవాల్సిన గురుతరమైన బాధ్యత నాపై ఉంది. మీరంతా వచ్చారు. డబ్బులిచ్చారు. మీరిచ్చిన ఈ పైసల్ని నేను తింటే కుష్ఠురోగ పీడితుడినై మరణిస్తాను. మీ నుండి ధనం తీసుకోవడానికి నాకేం హక్కుంది? కానీ ఇవ్వకుంటే మీకు లభించదు. ఇవ్వని వాళ్ళకు దొరకదు. అందుకే రాధాస్వామి మతంతో అనగా సంత్ మతంలో

**శిష్‌కో ఐసా చాహియే గురుకో సబ్ కుఛ్ దేయ్॥**
**గురుకో ఐసా చాహియే శిష్య్ కా కఛు వ లేయ్॥**

అన్నారు. అందుకే నేను మీ నుండి ఏ వస్తువూ తీసుకోను. ఒక మనిషి జ్ఞానవంతుడవుతున్నాడు. నా స్నేహితుడు నాకు సేవచేస్తే నాకు నష్టం లేదు. నేను కూడా అతన్ని సేవిస్తే సరిపోతుంది.

ఈనాడు గురుపూర్ణిమ. అజాయబ్ పురుషుని చిరునామా నాకు దొరికేలా చేసిన సత్సంగీలను నేను గౌరవిస్తాను. ఒకప్పుడు మనస్సు పరిభ్రమణంలో చిక్కుకునే ఉండేవాణ్ణి. కాన్‌పూర్ నుండి అమర్‌నాథ్ వచ్చాడిక్కడికి. మూడు సంవత్సరాలక్రితం అతని అంతరంలో ఒక రూపం ప్రకటించిందని చెప్పాడు. అదెవరి రూపమో అతనికి తెలియదు. అంతకు క్రితం ఆ రూపాన్ని, ఆకారాన్ని అతనెప్పుడూ చూడలేదు. కనుక అది ఎవరో తెలుసుకోవాలన్న ఆరాటంతో అన్వేషించసాగాడు. డెహరాడూన్‌లో ఉండే పండిత్ ఖుష్‌దిల్ దగ్గరికి వెళ్ళమని మిత్రులు సలహా ఇస్తే అక్కడికి వెళ్ళాడు. తన

సమస్యను ఆయనకు వివరించినప్పుడు నీ అంతరంగంలో నీలో ప్రకటించిన ఆకృతి ఎలా ఉందో చిత్రించమన్నాడు. ఇతను చిత్రం గీసి చూపించగా "ఈ పోలికలు గల ఇద్దరు మహాత్ములు నాకు తెలుసు. ఒకరు ఢిల్లీ వాస్తవ్యులు పీరేముగాం మహారాజ్ కాగా మరొకరు హోషియార్‌పూర్‌లో నివసించే ఫకీర్‌చంద్ మహారాజ్" అన్నారు పండిత్ ఖుష్‌దిల్. ఇతను నా దగ్గరికి వచ్చాడు. "ఏం ఫకీర్‌చంద్! నీవు అమర్‌నాథ్ అంతరంగంలోకి వెళ్ళావా?" అని నా ఆత్మను నేను నిలదీయవలసిందే కదా! నేను వెళ్ళలేదు. అతనిలో దర్శనం అయిన రూపం నాదని కూడా నాకు తెలియదు. అందుకే నేనీ అమర్ నాథ్‌కు మంచి దుస్తులు, నాలుగున్నర వందల రూపాయల్ని ఇచ్చాను. ఎందుకిలా చేశానో తెలుసా? ఇటువంటి వాళ్ళవల్లనే సంతుమతం బోధనలు నూటికి నూరుపాళ్ళు సత్యాలు అనే విశ్వాసం నాలో ధృవపడింది. నేను అమర్‌నాథ్ ఆంతర్యంలోకి వెళ్ళనట్లే బయటినుండి కూడా ఏదేవీ, ఏ రాముడూ, ఏ కృష్ణుడూ మనిషి ఆంతర్యంలోకి రారు. ఈ ఒక్క భ్రమలోనేపడి మానవజాతి వేలాది మతాలు, వేలాది పంథాలలో, సంప్రదాయల్లో విభక్తమైంది. అసలు విషయమేమిటని చాలాసార్లు ఆలోచిస్తాను. నేను, మీరు, మనందరం ఆలోచించే విషయాలు, మాట్లాడే మాటలు బ్రహ్మాండంలోకి వ్యాపిస్తాయి. బ్రహ్మాండంలోకి చేరుతాయి. ప్రతి మానవుని శరీరం నుండి రేడియేషన్ వెలువడుతూ ఉంటుంది. ఇది బయటంతా వ్యాపిస్తుంది. దీని సూత్రం, నిజం వైజ్ఞానికులకి బోధపడుతుంది. కాని సాధారణ మానవులకు అర్థం కాదు. అది అర్థంకాకపోతే మనందరం చూస్తున్న మరో ఉదాహరణ చెబుతాను. పోలీసుల దగ్గర కుక్కలుంటాయా లేదా? ఏదొంగలో, హంతకులో నేరం చేసి పారిపోయినప్పుడు వారిని పట్టుకోడానికి పోలీసులు కుక్కను వదుల్తారు. వదిలే ముందు కుక్కకు నేరస్తులకు సంబంధించిన వస్తువును వాసన చూపుతారు. అంతే! ఆ దొంగ ఎక్కడెక్కడనుండి వెళ్ళాడో ఆ స్థలమంతా వాసనను బట్టి గుర్తిస్తుంది. కుక్క దారిచూపి అతన్ని పట్టిస్తుంది. దీనివలన ఏం అర్థమవుతున్నది. దొంగనుండి ఏదో ఒక వాసన, ప్రత్యేకంగా బయటికి వెలువడినందునే ఇది సాధ్యమైందని తెల్సిపోయింది. దొంగ అనేకాదు. ప్రతి వ్యక్తి లోపలినుండి కనిపించని ఒకానొక వస్తువు, పరిమళం లేదా కిరణాలు బయటికి ప్రసరిస్తూ ఉండటం జరుగుతోంది. అదంతా బ్రహ్మాండంలో వ్యాపిస్తుంది. బ్రహ్మాండంలో మానవుల చెడు విచారాలే ఆలోచనలే కాదు. ఋషుల, మహాపురుషుల శుభ విచారాలు, ఆలోచనలు కూడా ఆకాశంలో నిండివుంటాయి. ఏదైనా అవసరం కలిగినప్పుడు వ్యక్తి మనస్ఫూర్తిగా తన

అంతరంగంలో ప్రార్థించి అది కావాలని కోరినప్పుడు అతనిలో శూన్యం ఏర్పడుతుంది. అంటే అతని మనస్సు ఖాళీ అవుతుంది. ఏదైనా కావాల్సివచ్చినప్పుడు బలంగా, తీవ్రంగా, దృఢమైన కోరికతో అది కావాలని సత్యమైన మనస్సుతో, మనసారా ప్రార్థించండి. అప్పుడు మీ మనసు శూన్యమై పోతుంది. ప్రకృతిలో ఏవస్తువూ శూన్యంగా, ఉండదు. అందుకే కోరినవారి కోరిక ఆవిరి ఆకృతి దాల్చి ఇతనిలోపలికి వస్తుంది. ఫకీర్‌చంద్‌గానీ, మరొకరు గానీ వస్తారని కాదు. నీవీ, నావీ అందరి ఆలోచనా విచారాలు ఆకాశంలోకి, బ్రహ్మాండంలోకి పోతాయి. అందుకే నేను బోధనల, శిక్షణల పద్ధతిలో మార్పు తెచ్చాను. ఓ మనిషీ! నీ మనసులో చెడు విచారాలకు, శత్రుత్వ భావనలకు చోటిస్తే, ఎవరికైనా కీడు కలిగించాలని ఆలోచిస్తే నీ ఈ ఆలోచనలన్నీ బ్రహ్మాండంలోకి చేరుతాయి. అవి నీకూ, నీ శత్రువులకూ కూడా నష్టాల్ని కలిగిస్తాయి. ఏం చెబుతున్నాను నేను? నా మాటల్ని అర్థంచేసుకునేందుకు ప్రయత్నించండి. బ్రహ్మాండంలో మంచీ, చెడు రెండు ఆలోచనలు ప్రభావాలు ఉంటాయి. ప్రపంచంలోని వాతావరణంలో మంచీ, చెడూ రెండు రకాల ఆలోచనా, విచారాల ప్రభావాలుంటాయి. ఇది సైన్సు. మనిషి ఎటువంటి కోరిక, అభిలాషని కలిగి ఉంటే అటువంటి ఆకృతులు ధరించి బ్రహ్మాండంలోని ఆలోచనా విచారాలే ఎదుటికి వస్తాయి. అతని లోటును పూరిస్తాయి. ఓ మానవా! నీవు ఎవరినీ బాధపెట్టకు. కొట్టకు. విసిగించకు, నిందించకు. నీ మనసులో దుష్ట ఆలోచనా విచారాలకు తావిస్తే అవి బ్రహ్మాండంలోకి వ్యాపించి నీ సాంగత్యంలోకి వచ్చే వారిపై ప్రభావం చూపిస్తాయి. ఏం చెబుతున్నానో అర్థమవుతోందా? ఇప్పుడు మీరు సత్సంగానికి వచ్చారు. మీకు సత్సంగం ఇస్తున్నాను. నా రేడియేషన్ మీకు వస్తుంది. మీరు నా దగ్గరికి వచ్చి పాదాలకి మొక్కుతారు. నా శరీరాన్ని తాకుతారు. దానివలన మీ రేడియేషన్ నాపైపడి నన్ను తినేస్తుంది. అంటే నా మనస్సుపై ప్రభావం చూపుతుంది. ఆ తేడాని స్పష్టంగా గమనిస్తుంటాను. నేను పూర్వజన్మలో ఏ దుష్కర్మ చేశానో ఈ పనిని ప్రస్తుతం నేను చేయవలసి వస్తోందనిపిస్తూ ఉంటుంది నాకు. నా దగ్గరికి వస్తున్న మీరు నా శత్రువులనే అనుకుంటాను. 20, 30 సంవత్సరాలకు ముందు నాకీ నిజం తెలిసి ఉంటే గురుయిజాన్ని స్వీకరించేవాణ్ణే కాదు. దాతా దయాలుని ఆజ్ఞను కూడా పాటించేవాణ్ణికాదేమో? ఇది సైన్సు. ఉదాహరణకి ప్లేగు వచ్చిన వ్యక్తి దగ్గరికి వచ్చి తాకితే తాకినవారికి ఆ వ్యాధి అంటుకుంటుంది. అవునా? అది బాహ్యా శరీరానికి సంబంధించినది. ఇది మనసుకు సంబంధించింది. మనసులో దుష్ట ఆలోచనా విచారాలు వాటి ప్రభావం

చూపుతుంటాయి. అందుకే వాటి నుండి తప్పించుకుని నన్ను నేను రక్షించుకోడానికి నేను మీలో ఏ ఒక్కర్నీ ప్రేమించను. నా స్వార్థంకోసం, నా పనుల కోసం మీపై ఆధారపడను. మీరు వచ్చి 10 రూపాయలు నా మందిరంలో ఇచ్చి పోవాలనే ఆలోచనే నాకు రాదు. మీరు నన్ను సేవించాలని కూడా అనుకోను. మీరు నన్ను ప్రేమిస్తారు. పూజిస్తారు. ప్రతిఫలంగా, జవాబుగా నిష్కామ ప్రేమను మీకిస్తాను. దుస్సాంగత్య ప్రభావం ఫలితంగా గొప్ప గొప్ప మహాత్ములే పతనమవుతుంటారు. నిన్న ఒకావిడ వచ్చింది. ఆమె కొన్ని సంఘటనలు చెప్పింది. ఆమెకొక సోదరుడు ఉన్నాడు. అతను ఒక అవధూతను చూశాడు. అవధూత నగ్నంగా ఉండేవాడు. నిశ్చింతగా, తనలో తను నిమగ్నమై ఉండటం పరిశీలించి ఆమె సోదరుడు ఆ ఆవధూత దగ్గర శిష్యునిగా చేరాడు. అక్కడే మరికొందరు శిష్యులుగా చేరారు. ఆ అవధూత శిష్యుల వలలో చిక్కుకున్నాడు అంటే శిష్యులపై మమకారం పెంచుకున్నాడు. స్త్రీలు కూడా అతని దగ్గరికి రాసాగారు. ఆమె సోదరుడు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి మందిరం కట్టించాడు. ఎంతో సేవ చేశాడు. ఇప్పుడు ఉదాసీనతతో తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఆ మహాత్ముడు ఎందుకు దిగజారిపోయాడు? మీవంటి గృహస్థులని ప్రేమించాడు గనుక. అందుకే నేను నిష్కర్షగా, స్పష్టంగా చెబుతున్నాను. మీలో ఏ ఒక్కరినీ నేను ప్రేమించను. వ్యామోహ పడను. పురుషోత్తమదాస్‌ను ఒకప్పుడు నేను కూడా ప్రేమించేవాణ్ణే. కానీ ఇప్పుడా స్థితినుండి బయటపడ్డాను. మీ గురించి ఆలోచించి మిమ్మల్ని ప్రేమిస్తే నేనెక్కడికి వెళ్తానో ఏమైపోతానో గదా! మీరు సత్సంగాలకి వస్తూ గురువును ప్రేమిస్తారు. మళ్ళీ ఇతరుల్ని ప్రేమిస్తారు. మన ఉన్నతి జరగకపోవడానికి అసలు కారణం ఇదే! ఈ నామదానం పొందడానికి ఎవరు అర్హులు అని ఆలోచించకుండా నా వంటి గురువులు అడిగిన వాళ్ళందరికీ నామదానం ఇస్తూ వస్తున్నారు. మేం మీ మేలుకోసం ఉద్ధారం కోసం నామదానం ఇవ్వక విషం ఇస్తున్నామనిపిస్తూ ఉంటుంది నాకు. నామాన్ని విషం అని ఎందుకంటున్నాను? నామదానం పొందడానికి ఎవరు అర్హులు? ఎవరికి ఇవ్వాలి?

**"విషయన్‌సే జో హోయె ఉదాసా।**

**పరమారథ్‌కే జామన్ ఆసా॥**

**ధన్ సంతాన్ ప్రీతివ జాకే।**

**జో జస్ ఫిరే తస్ ఫల్ చాకే॥"**

విషయ వికారాలను త్యజించి, పరమార్థంవైపే మనసు ఉంచినవారికి, ధనం, సంతానం పట్ల వ్యామోహం వదులుకున్న వారికోసమే ఈనామం. నామస్మరణ అని పై దోహాకి అర్థం.

ధన ధాన్యాల్ని, గౌరవసంపదల్ని, ఇళ్ళు, భూముల్నీ దైవేచ్ఛకు వదిలి, దైవనిర్ణయంపైనే భారంవేసి అప్పుడు సత్సంగానికి రండి. మీ సాంగత్యం వలన నేను కూడా కొన్నిసార్లు మాయల్లోపడి పోతాను. నేను మిమ్మల్ని ప్రేమించాను అని అనను. నా స్వప్రయోజనం, స్వార్థం మీ నుండి నెరవేరాలని ఏకోశానా నాకు ఉండదు. మీరు రావాలి, నా మందిరానికి డబ్బులివ్వాలనిగాని లేదా నా పనులు చేసి వెళ్ళాలనిగానీ నేను కలలోకూడా అనుకోను. నా గురువు శిక్షణను మార్చుమని నాకు బాధ్యత ఇచ్చారు. నా డ్యూటీని నిర్వహిస్తున్నాను. ఒకరకంగా నా కర్మను అనుభవిస్తున్నాను.

రాధాస్వామి మతం లేదా కబీర్ మార్గీయులు చెప్పే దైవం ఏమిటి ఎలా, ఎక్కడ ఉంటాడు? అనే అంశాన్ని తెలుసుకోడానికి నేనీ విధి నిర్వహిస్తున్నాను. ఇప్పుడు నాకు అసలు విషయం బోధపడింది. మనం దైవంగా భావించి, పూజించే రూపాలు మన మనోభావనలకు ప్రతిరూపాలే! మనసు రూపొందించిన ఆకృతులే. ఒక వ్యక్తి భగవంతుడు నిరాకారుడని నమ్ముతాడు. మరొక వ్యక్తి సాకారుడని విశ్వసిస్తాడు వీళ్ళిద్దరూ మనసుతోనే ఆయా సాకారా, నిరాకార రూపాలను ఏర్పర్చుకున్నారు. అనేక మతాలున్నాయి. అన్ని మతాల వాళ్ళూ తమ దైవాల ఆకృతుల్ని మనస్సుతో రూపొందించుకున్నవారే! అసలైన ఈశ్వరుడు, అసలైన పరమాత్ముడు ఇక్కడ లేడు. మరి అసలైన పరమాత్ముడు లేడా? ఉంటే ఎక్కడున్నాడు? ఎలా ఉంటాడు? అనే సంశయాలు వస్తాయి. దేనినుండి మన మనస్సు వెలువడిందో, ఏ వస్తువుతో ఆ మనసు తయారైందో అది అసలైన భగవంతుడు. ఆ వస్తువు ఏమిటి? అదే వెలుతురు ప్రకాశం. ప్రకాశమే భగవంతుడు. ఆ ప్రకాశ స్వరూపుడైన పరమాత్ముని నుండే ఆత్మ, మనస్సు వెలువడింది. ఆ ప్రకాశమే మన శరీరంలో ప్రవేశించకుంటే మనస్సు, చిత్తం, బుద్ధి, అహంకారం పుట్టజాలవు. రాముని పూజించేవాళ్ళు, బాబాఫకీర్ను పూజించేవాళ్ళు, జీసస్‌ని నమ్మేవారు, మహ్మద్‌ని కొలిచేవారు వీళ్ళంతా వారివారి మనసులనే పూజిస్తారు. ఇదంతా చూశాక నాకు తోచింది చెబుతాను. స్వామీజీ మహారాజు, ఇతర సంతులు ఇదంతా కాలం, మాయ అని చేసిన విమర్శ అక్షరాలా సత్యం అనే నిర్ధారణకి వచ్చాను. ఇకపోతే సంతులు ఎవర్ని పూజిస్తారు? మనసు, చిత్తం, బుద్ధి, అహంకారాన్ని

తయారుచేసే ప్రకాశాన్ని పూజిస్తారు. ప్రకాశాన్ని దర్శిస్తారు. ఈ విషయాన్నే సనాతన ధర్మంకూడా బలపరుస్తున్నది.

**"ఓం భూర్భువః స్వః మహాజనం:**
**తపఃసత్యం తత్ సవితుర్వరేణ్యం"**

ఆ సత్యం, ఆ ప్రకాశమే అసలైన దేవుడు. పరమాత్ముడు. సత్యమైన ఆ భగవంతుని కలుసుకోవాలనే ఆర్తి, తపనగల మనిషి తన అంతరంలో, శబ్ద, ప్రకాశాల్ని ప్రకటించుకోవాలి. నా కర్థమైన సత్యం ఇదే! సనాతనులు కూడా ఇదే చెప్పారు. ముసల్మానులు కూడా ఇదే చెప్పారు. ముసల్మానులు కూడా ప్రకాశతత్వాన్ని విశ్వసించి అంగీకరిస్తారు. అయితే ఈ వివాదమంతా ఎవరివలన వస్తోందనే ప్రశ్నరావటం సహజం, ఏదీ తెలీక సనాతన ధర్మంగురించి తెలియదు. ఇస్లాం గురించిన వాస్తవం అర్థంకాలేదు. ఏదీ తెలియక పోయినా వివాదాలు సృష్టించేవారివలన యావత్ప్రపంచం మనస్సుయొక్క పరిభ్రమణంలోనే చిక్కుబడి ఉంది.

ఈరోజు గురుపూర్ణిమ. మీరు నన్ను సేవించారు. మరి నేను మీకెలాంటి సేవ అందించాలి? కాన్పూరు నుండి వచ్చిన వ్యక్తి లేదా ఐ.సి.శర్మలాంటి వాళ్ళు నావద్దకు వచ్చినప్పుడు యథార్థం, సత్యం చెప్పకుండా వారిని నావలలో వేసుకుని, కాళ్ళకు మొక్కించుకుని, డబ్బులు తీసుకుంటే నేను అపరాధిని అవుతాను. మీలో కన్పించింది. నేనుకాదు. మీ మనస్సురూపమే అన్న వాస్తవాన్ని మీకు చెప్పటమే నేను అందిస్తున్న సేవ. ఈ రహస్యాన్ని చెప్పకుండా ఎందరో మహాత్ములు తమ జీవితాల్ని వ్యర్థం చేసుకున్నారు.మీలో నమ్మకం పోకూడదని మిమ్మల్ని అజ్ఞానంలోనే ఉంచారు. కానీ అమూల్యమైన తన జీవిత కాలాన్ని నిరుపయోగం చేసుకున్నారు. ఏ గురువూ ఏమహాత్ముడూ ఎవ్వరి కలలో అంతరంగంలోకీ వెళ్ళి దర్శనమివ్వడు. నేను తమ అంతరంగంలో దర్శనమిచ్చానని ఎందరో చెబుతారు. కానీ నాకా విషయమే తెలియదు. నేను వెళ్ళనప్పుడు ఇతరులు వెళ్తారని ఎలా అనుకోగలను. చెప్పండి: రేడియేషన్‌లో తరంగాలుంటాయిని సైన్సు చెబుతుంది. జర్మన్ సైనిట్‌హాల్లో కొన్నేళ్ళక్రితం వక్తల ఉపన్యాసాలు రికార్డు చేశారు. మనం నోటితో చెప్పేదీ, ఆలోచించేదీ విచారించేదీ బ్రహ్మాండంలో వ్యాపించి ఉంటుంది. ఏ వస్తువు అవసరం కలిగితే అది బ్రహ్మాండంలో నుండీ ఆయా వ్యక్తులకి అందుతుంటాయి. ఇవి నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్న అంశాలు. ఇంగ్లండులో ఆత్మల్ని పిలుస్తు ఉంటారని చాలా మంది చెబుతుంటారు.

ఆ వచ్చిన ఆత్మ భవిష్యత్తును చెప్పదు. మరణించేవారి ఆలోచనలు బ్రహ్మాండంలో ఉంటాయి. అవి వచ్చి అనుభవిస్తుంటాయి. కానీ దాని భవిష్యస్థితులు చెప్పజాలవు. నాకు బోధపడిన విషయాల్ని మీకూ చెప్పాలని నాప్రయత్నం. చనిపోయిన వారెవ్వరూ ఇక్కడ ఉండరు. రాముడు, దాతాదయాల్, బాబాగురునానక్ ఎవరూ లేరిప్పుడు. కాని వారి ఆలోచనా విచారాలు, భావాలు వుంటాయి. ఏ మనిషైనా తనలో ప్రయత్నిస్తే బ్రహ్మాండంలోని ఆలోచనా తరంగాలు ఇతనిలోనికి వస్తాయి. అవి కూడా వస్తాయి. ఉదాహరణకి రేడియో తరంగాలు మనకి కన్పించకున్నా అన్ని చోట్లా ప్రసరిస్తుంటాయి. ఎక్కడో కేంద్రంలో ప్రసారం చేస్తే జలంధర్‌లో విన్పిస్తుంది. ఢిల్లీలోనూ పలుకుతుంది. ఇదే విధంగా మన ఊహలు, కల్పనలు మన ఆలోచనా విచారాలు, బ్రహ్మాండంలో ఉంటాయి. మనిషి చెడు ఆలోచనలు లోలోపల చేస్తాడు. కానీ తను ఎవరికీ అపకారం చేయలేదనుకుంటాడు. ఓ మనిషీ! నువ్వు సదా దుష్ట ఆలోచనలు, భావాలు, విచారాలు చేస్తూ ప్రపంచానికి విషం ప్రసరింపచేస్తున్నావు. నీ ఆలోచనా విచారాలు, బ్రహ్మాండంలోకి వెళ్ళి అవి ఇతరులపై ఆక్రమణ చేస్తాయి. ఏం చెబుతున్నాను? నాకు లెక్చర్లివ్వటం రాదు.నా అనుభవాల్ని వెల్లడిచేస్తున్నాను. అందుకే వేదమార్గంలో శుభ సంకల్పమస్తు అన్నారు. మఫం మన ఇంట్లో కూర్చుని ఇతరులకి చెడు జరగాలని ఆలోచిస్తుంటాం. దీని ప్రభావం ఉండదనుకుంటాం. కానీ ఆ ఆలోచనా విచారాల తరంగాలు నీ లోపలి నుండి వెలువడి బ్రహ్మాండంలోకి పోతాయి. వాటి ప్రభావం ఇతరులపై పడుతుంది. సైన్సు కూడా ఈ విషయాల్ని ఋజువుచేస్తోంది కదా! మనరుషులు ఏం చెప్పారు? వ్యక్తి గుణాల ప్రభావం వారు ధరించిన దుస్తులలోనికి కూడా ప్రసరిస్తుంది. ఇతరులు ఆ బట్టలు వాడితే వారి ప్రభావం వీరిలోకి పోతుంది. నా మాటల్ని ఆలోచించండి! కొన్ని వర్గాలలో పగ్‌డీ మార్పిడి సోదరులు ఉంటారు. అంటే తన తలపాగాని తనకు ఇష్టమైన వ్యక్తి తలకి అలంకరిస్తాడు. అవతలి వ్యక్తి తన పాగాను ఇతనికి అలంకరిస్తాడు. దానివలన ఒకరి ఆలోచనలు మరొకరిలోకి ప్రసరిస్తాయి. అలా మార్పిడి చెందాలని వాళ్ళు మార్చుకుంటారు.

మీరంతా సత్సంగానికి వచ్చారు. నా వార్ధక్యంపై దయ చూపి నా మాటల్ని అర్థం చేసుకొనండి. మీ జన్మను సార్థకం చేసుకోండి. పైసలివ్వటం వలన, హారతులివ్వటం వలన మీరు తరించాలనుకుంటే అది జరగనిపని. ఇవ్వటం, తీసుకోవటం ప్రాపంచిక వ్యవహారం. ఎవరు ఎవరికీ ఏమి ఇవ్వరు. క్రితం జన్మలో ఋణ పడితే దానిని తీర్చుకోవడమే ఈ ఇచ్చి పుచ్చుకోవడాలు.

నేనీ పని ఎందుకు చేస్తున్నాను? ఆలోచిస్తుంటాను. "ఫకీర్‌చంద్! ఈ సాలెగూడుని ఎందుకు అల్లుకున్నావు" అని! సంతుమతంలోని సారం, వాస్తవం, అసలుతత్వంను సుస్పష్టంగా, సంపూర్ణంగా విప్పి చెప్పాలనే ఫకీర్‌చంద్ దేహంలో వచ్చానీ ప్రపంచంలోకి. మానవులు అసలు తత్వాన్ని అర్థం చేసుకుని ఇతరమార్గం నుండి తమను తాము రక్షించుకోవాలి. తప్పించుకోదల్చుకోనివారికి, తమను రక్షించుకోవాలని అనుకోనివారికి నేను మాత్రం ఏంచేయగలను?

నేను ఎవరి అంతరంగంలోకి వెళ్ళనని నమ్మకం కుదిరింది గనుక ఇప్పుడేం చేస్తాను? మనసును విడిచిపెట్టిపోతాను. మనసు ప్రభావం నాపై పనిచెయ్యదు. సత్సంగీయులే తొలి శత్రువులేమోనని కొన్నిసార్లనిపిస్తూ ఉంటుంది. ఎందుకంటే మీ రేడియేషన్ నాపై ప్రభావం చూపుతుంది. దీనికి నాకున్న ఉపాయం ఏమిటి? నేను నా స్వప్రయోజనాలకోసం మీలో ఎవర్నీ ప్రేమించను. మీతోనే అనేమిటి? నా కొడుకుని, కోడలిని, మనవళ్ళు, మనవరాళ్ళని ఎవర్నీ ప్రేమించను. చనిపోయిందికానీ ఇపుడైతే నా భార్యని కూడా నేను ప్రేమించను. రేడియేషన్ పనిచేస్తుందనే నేనెవర్నీ ప్రేమించను. ఈ రేడియేషన్ నుండి ఎవరూ తప్పించుకోలేరు. అందుకే "ఓ మనిషీ! ఈ ప్రపంచం ఇలాగే ఉంటుంది. దీని నుండి నువ్వు తప్పించుకుని, రక్షణపొందాలనుకుంటే మనసు స్థితినుండి పైకి వెళ్ళిపో" అంటారు సంతులు. ప్రపంచంలోనే ఉంటున్నావు గనుక ఎంత ప్రయత్నించినా రేడియేషన్ నుండి తప్పించుకుని ఎక్కడికీ పోలేవు. అయితే జనన మరణాల నుండి తప్పించుకోవడానికి సంతుల దగ్గర ఒక పద్ధతి ఉంది. నేను తరచు మీకు చెబుతూనే ఉంటాను. దాన్ని సైన్సు కూడా ఋజువు చేసింది. డాక్టర్లు మరణిస్తున్న వారిని త్రాసుపై ఉంచి తూచారు. ఆత్మవెళ్ళిపోయి మనిషి విగతజీవుడయ్యాక మళ్ళీ తూచారు. కొందరికి ఐదు గ్రాములు, మరికొందరికి 25 గ్రాముల బరువు తగ్గటం గమనించారు. ఆత్మ బరువుగా ఎందుకుంది? అంటే చనిపోయినవాడికి స్థూల పదార్థాలతో, ప్రాపంచిక వ్యవహారాలతో, వ్యక్తులతో ప్రేమ ఉంది. గురువును మనిషి అనుకున్న వారిని జనన మరణాల చక్రంనుండి ఎవరూ తప్పించజాలరు. ఎందుకంటే ఫకీర్‌చంద్‌ను శరీరం అనుకుంటాడు ఆ మనిషి. అతని ప్రేమ ఫకీర్‌చంద్ దేహంతోనే ఉంది. ప్రస్తుత గురుయిజంను పాఖండియిజం అనవచ్చు. "నామం పొందండి! గురువు అంత్యసమయంలో వచ్చి నిన్ను సత్‌లోకానికి తీసుకుపోతాడు" అని చెబుతారు. అంత్యసమయంలో నీ ఎదుటకు వచ్చే దేహధారి

గురువు నిన్ను సత్‌లోకానికి తీసుకుపోజాలడు. కాకపోతే కొంచెం మంచి జన్మవస్తుంది. మంచి ఆలోచనా విచారాలు దొరుకుతాయి. ప్రస్తుతం అనేక గురుమతాలలో మోసం, దగా కన్పిస్తున్నాయి. నా బాధ్యతను నేను సత్య సంధతతో నిర్వర్తించాను. ఆ అజాయబ్ పురుషుడు ఎక్కడుంటాడో నాకు అర్థమైపోయింది. అతను మనసుకంటేపైన, మనసును విడిచిన స్థితిలో ఉంటాడు. నాకు ఈ అనుభవం మీ వల్లనే, సత్సంగీయుల వల్లనే అయింది. నన్ను గురువుగా భావించేవాళ్ళకు చెబుతున్నాను నేను. అబద్ధంచెబితే నాకు కుష్ఠురానీ! నేను మీ చరణాలలో నా తలనువంచి మీరు నా గురు స్వరూపులని భావించి నమస్కరిస్తాను. ఎందుకు? ఎందుకంటే మీ వలన నాకు జ్ఞానోదయమైంది. ఏ వస్తువుకోసం నేను అహరహం శోధించానో, వేలరూపాయలు హారతులకని ఖర్చుపెట్టానో అది లభించింది. గురువుని సేవించమని ఆజ్ఞ లభించింది. 12 సంవత్సరాలు నేను సంపాదించినదంతా అక్కడికి పంపించాను. కానీ అసలు రహస్యం బోధపడలేదు. "ఫకీర్‌చంద్! నీకు సత్యమైన సద్గురువు సత్సంగి రూపంలో దొరుకుతాడ"ని చెప్పారు దాతాదయాళ్. ఇప్పుడు మీ అనుభవాలు నా కళ్ళు తెరిపించాయి. నేను ఈ పనివలన సుఖంగా లేను. మీకు స్పష్టంగా సత్యాన్నే చెబుతాను.

**"కర్మప్రధాన్ విశ్వకర్ రాఖా।**
**జో జస్ కీన్హా తసుఫల్ చాఖా॥"**

"ఈ విశ్వం కర్మప్రధానమైనది. ఎవరెలాంటి కర్మముచేస్తే అలాంటి ఫలితము అనుభవించవలసిందే"!

నా అనుభవాల్ని చెబుతానని నేను ప్రతిజ్ఞచేశాను. దాతాదయాల్ భగవంతుడేనని విశ్వసించాను. ఆయన ఆజ్ఞను పాటించటం నా బాధ్యత. శరీరం వదలేముందు అంటే నా జీవితకాలంలోనే శిక్షణల పద్ధతిని మార్చమని ఆయన ఆదేశించాడు. కాబట్టే ఆయన ఆజ్ఞకు బద్ధుడినైనాను. నేను చెప్పే అంశాల స్థాయికి మీరు చేరుకోలేరని నాకు తెలుసు. కాని అక్కడికి చేరడం కూడా మీ వశంలో లేదు. జన్మజన్మాంతరాల సంస్కారప్రభావం ఉంటుంది. ఎవరో ఒక భాగ్యశాలి అక్కడికి వెళ్ళగలడు. బాబా సావన్‌సింగ్ అనేవాడు. "ఎంతో అదృష్టం ఉంటేనే సత్సంగం లభిస్తుంది. ఎంతో అదృష్టం ఉంటేనే సత్సంగంలోని విషయాలు అర్థమవుతాయి. గొప్ప అదృష్టం ఉంటేనే అవి అమలు చేయడానికి పూనుకుంటాడు మనిషి అని.

మీవంటి గృహస్థుల కోసమే నేను 'ఇన్సాన్‌బనో' మనిషివికమ్మ' అన్న నినాదమిచ్చాను. ఏ పని చేసినా వివేకంతో చేయటం నేర్చుకోండి!

**"గురుపశు త్రియా పశు - వేదపశు సంసార్ ।**
**మానుష్ తాహె జానియే - జామె వివేక విచార్ ॥"**

బాగా ఆలోచించి పని చెయ్యండి. సంతానం కోసమే సంతానాన్ని కనండి. ప్రస్తుతం అయాచిత సంతానం కంటున్నారు. అలాంటి సంతానం మిమ్మల్ని సేవించాలని, గౌరవించాలని, మీ మాట వినాలని ఆశిస్తారు. అదెలా సాధ్యం చెప్పండి! మొన్న నా దగ్గరికి ఒక వ్యక్తి ఏడుస్తూ వచ్చాడు. "కొడుకుని పెంచిపోషించాను, చదివించాను. పెళ్ళిచేశాను. అతను ఇంట్లో ఎప్పుడూ పోట్లాడేవాడు. ఇప్పుడు వేరు కాపురం ఉంటున్నాడు." ... అని చెప్పాడు. "కొడుకు పుట్టాలన్న కోరికతో నీ భార్య దగ్గరికి వెళ్ళావా" అని నేను ఆ వ్యక్తిని అడుగుతున్నాను. తన స్వార్థంకోసం, కాంక్షకోసం వెళ్ళాడు. పిల్లవాడు గర్భంలోకి ప్రవేశించాడు. ఆ విధంగా కలిగిన పిల్లలు తను చెప్పినట్లు వినాలనుకోవటం వ్యర్థమైన ఆలోచన. నేనివ్వదలచిన వివేకం ఇదొకటి. రెండవది వివేకం. నీ ఆలోచనా విచారాల్లో, ఊహల్లో చాలా బలం ఉంది. దీనికి ఉదాహరణ చెపుతాను. నేను మీకు రామాయణం బోధించను. గీతాపారాయణం చేయించను. అంజీల్ చదివించను. వాస్తవాంశాన్ని చెబుతాను. రాత్రి పడుకుంటావు. నీకు కోపం వస్తుంది. ఎవరినో కొట్టాలనుకుంటావు. నీ చెయ్యి కదుల్తుంది. రాత్రి స్వప్నం వస్తే భయపడి అరుస్తావు. నీ నాలుక కదులుతుంది. అంటే స్వప్నంలోని అంశాలు నీ వశంలో లేవు. నీ వశంలో లేనివే నీ శరీరంపై ప్రభావం చూపినప్పుడు, జాగ్రదవస్థలో మేల్కొని ఉండి, ఎవరినో ఒకరిని ద్వేషిస్తావు, కొట్లాడుతావు. మరొకరికి విరుద్ధంగా ఆలోచించి వ్యూహం పన్నుతావు. మరి దీని ప్రభావం నీ శరీరంపై పడదా? పడుతుంది. ఇది న్యాయానుసారమైన వాస్తవం. ఇందులో హిందూ, ముస్లిం, క్రైస్తవులనే ప్రశ్నేలేదు. మానవత్వానికి సంబంధించిన విషయం. అందుకే ఎవరు మనిషి? వివేకంతో వుండేవాడే మనిషి

వివేకం, విచారాలు నాకు అర్థమైనా కర్మవశాన చెబుతున్నాను. ఓ దాతా! శిక్షణ మార్చమని నువ్వు చెప్పావు. నాకు బోధపడిన అంశమే చెబుతున్నాను.

ఇంకొక వివేకం- మీ ఆలోచనలో, ఊహలో బలం ఉంది. మీరు ఇళ్ళల్లో ఉంటారు. ఒకరు మరొకరిపట్ల చెడుకోరకండి. దురాలోచనలు చేయకండి. ప్రస్తుతం

ఇళ్ళల్లో ఏం జరుగుతోంది? కొడుకు తండ్రికి విరుద్ధం. భార్య భర్తకు విరుద్ధం. అన్నాదమ్ములకు పడదు. దేశంలో జరుగుతున్న దేమిటి? ఒక పార్టీకి మరొకపార్టీ పొడగిట్టదు. ఇలాంటిస్థితిలో నీదేశం సుఖంగా ఉండాలని నువ్వాశిస్తే అది జరిగే పనేనా?

## ఇబ్త్ మే ఇష్క్ హై రోతాహై క్యా?
## ఆగే ఆగే దేఖ్‌నా హోతాహై క్యా?

మన ఆలోచనా విచారాలు వాటి పరిణామం ఏమిటో నేను చెప్పను కానీ దాని ప్రభావం శరీరంపై తప్పక పడుతుంది. దీనిని ఏ శక్తీ ఆపజాలదు. ఏ పార్టీ వచ్చినా మనల్ని కష్టాలనుండి కాపాడజాలదు. ఎందుకంటే ఇది ప్రకృతి నియమం. ప్రకృతి లీల. ప్రస్తుతం అయిష్టం, ద్వేషం వ్యాపించి ఉంది. రాజనైతిక దళాలు గుండాగిరీ చేస్తుంటాయి. మన ఇళ్ళలో రోజూ కొట్లాటలవుతుంటాయి. కోల్డ్‌వార్ 'శీతయుద్ధం' చేస్తుంటారు. ఇదంతా చేసి సుఖ సంతోషాలు ఉండాలని ఆశించటం అనవసరం. నాపై బాధ్యత ఉంది కనుక చెప్పాను.

మూడవ అంశం- నవయువకులకు నేను చెప్పదల్చుకున్నాను. ప్రౌఢత్వం కంటే ముందే బ్రహ్మచర్యం నష్టం చేసుకోకండి. అమ్మాయిలు చెడు ఆలోచనల్ని పెట్టుకోకండి. లేదా మెదడు పనిచెయ్యకపోవటం, సుస్తీ అవటం తప్పదు. అందుకే నేను శిక్షణని మార్చాను. మంచి సంతానం కనండి. ఇళ్ళల్లో శాంతి వాతావారణం కల్పించండి. మానసిక, శారీరిక బ్రహ్మచర్యం పాటించండి.

నాలుగవ విషయం- మనిషి మనస్సుచాలా బలహీనమైనది. దీనికి బలం చేకూర్చాలంటే సుమిరణ, ధ్యానం చెయ్యాలి. రాధాస్వామి మతం ప్రకారమే చెయ్యి అనిగానీ, సిక్కుమతం పద్ధతిలోచెయ్యి అనిగానీ నేను అనను. నీ మనస్సును భ్రూమధ్యంలో కేంద్రీకరించి ప్రయత్నించు. రామజపమే చెయ్యి, అల్లా జపమే చెయ్యి, వాహెగురు అను, ఇవేవీ ఇష్టం కాకుంటే 1,2,3,4,5,10 నెంబర్లు అనుకో. నీ మనసుకి ఏకాగ్రత అవసరం. మనసు ఏకాగ్రమైతే 'విల్‌పవర్' పెరుగుతుంది. పనులు నెరవేరుతాయి. ఒక్క విషయం చెబుతాను. నేను ఏ మతానుయాయుణ్ణీకాను. హిందువును కాను. ముస్లింను కాను. రాధాస్వామిని కాను. సిక్కును కాను, క్రిష్టియన్ని కాను. నేను మనిషిని. మీలాగే ఓ మనిషిని. దాతాదయవలన అన్ని బంధనాలు తెగిపోయాయి. మానవత్వపు దృక్పథంనుండి నేను మీకు చెబుతాను. మనసుచాలా

చంచలమైనది. ఒకచోట నిలువదు. దీనిని అదుపుచెయ్యటం తేలిక కాదు. దీనికి తగిన చికిత్స ఏమిటంటే. ఒకటి సత్సంగం అవసరం. రెండోది భ్రూమధ్యంలో స్మరణ చెయ్యండి. రాధాస్వామి నామమనే కాదు. మీ ఇష్టం వచ్చిన నామస్మరణ చెయ్యండి. నన్నడిగితే రాధాస్వామి నామంస్మరించమని చెబుతాను. ఎందుకంటే గురుప్రణాలిని తెంచాలని నేననుకోవటం లేదు. కానీ శిష్యులుగా ఎవరినీ చేసుకోలేదు.

ప్రతిరోజూ ప్రాత: సాయంకాలాల్లో తప్పకుండా మీ వీలునుబట్టి 15 నిమిషాలు, 20 నిమిషాలు, అరగంట ధ్యానం చెయ్యండి. మీ జీవితం మారిపోతుంది. మీ సంపాదన సరైన, సక్రమమార్గాన, చెమటోడ్చి సంపాదించినదై ఉండాలి. మోసం చేస్తారు. కింది మీదా చేసి 420చేసి, తారుమారు చేస్తారు. ఆదాయం, సంపాదన ఎలాంటిదైతే అటువంటి ప్రభావం పడుతుంది. ఇవి నాలుగైదు మాటలు నేను మీకు చెప్పాను. మనసుకు సంబంధించిన అంశాలు టేప్ రికార్డుల్లో వినవచ్చు. వాటి వలన మీకు మరింత తెలిసే వీలుంది.

మీరంతా వచ్చారు. దాతా నేను పతితుణ్ణి! నావంటి పతితుణ్ణి చేరదీసి, శరణుమిచ్చి, హత్తుకున్నావు. ఆట ఆడించావు. నా వద్ద ఏమిలేదు. నీవిచ్చిన సంస్కారంతో పనిచేశాను. మంచే చేశానో, చెడే చేశానో తెలియదు. ఇప్పుడు జీవితం పరిసమాప్తి దశలో ఉంది. ఓ పరమాత్మా! నీ చరణ కమలాలలోనాకు స్థానమివ్వు. ప్రపంచాన్ని మరిచిపోతాను. నీ దయ! దాతా రూపంలో నీవిచ్చిన ఆజ్ఞను శిరసావహించాను. క్షమాపణ కోరుతున్నాను. ఒక గంట చెప్పాను.

**అందరికీ శాంతి - అందరికీ రాధాస్వామి.**

★

# వందన

చరణ శరణకీ వందనా నిత్ కోయి ఔర్ న కామ్ ।
గురుబసోచిత్ ఆయే మేరే బక్షదోనిజనామ్ ॥1॥

తేరీ శరణాగత హూవా ఫిర్ కిసికీ రాఖూం ఆస్ ।
ఆస్ తో తేరీ దయాకీ జగ్‌సే రహూం ఉదాస్ ॥2॥

రూపధ్యావూం నామగావూం శబ్దరాతామన్
ఆఠోం యామ్ తేరాహీ సుమరణ భాగ్య మేరాధన్ ॥3॥

శీష్ పర్ నిజకర్ కమల్ ధర్ లియా చరణలగాయ్ ।
పతిత పాపీ తర్‌గయా గురు శరణ తేరీ ఆయ్ ॥4॥

ముక్తికీ నహిం చాహమన్ మే భక్తిప్యారీ లాగ్
రాధాస్వామీ కీ దయాసే భాగ్య పూరణ జాగ్ ॥5॥

ఈ పుస్తకం ముద్రణకై ఆర్థిక సహకారం అందించినవారు

| | | | రూ. |
|---|---|---|---|
| ఆర్. మనోహర స్వామి | - | వరంగల్ | 216.00 |
| ఎన్నాకుల శంకరయ్య | - | కరీంనగర్ | 200.00 |
| శివానందం | - | హుజూరాబాద్ | 100.00 |
| చిన్నం వెంకటేశం | - | జడ్చర్ల | 100.00 |
| సరోజనమ్మ | - | సికింద్రాబాద్ | 100.00 |
| అనుపమ్ దయాల్ | - | | 116.00 |